




చెన్నయ్.. చంద్రముా!

హాయ్.. హలో.. నమస్తే.. బాగున్నారా! అంటూ సినీనటి శ్రీలీల రాజమహేంద్రవరంలో సందడి చేశారు.. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రారంభించి కాసేపు అభిమానులతో ముచ్చటించారు. శ్రీలీల వస్తుందని తెలియడంతో పెద్ద ఎత్తున అభిమానులు షోరూమ్ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీలీల అభిమానుల ముందుకు వచ్చి కాసేపు అలరించారు. రాజమహేంద్రవరం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు.. చెన్నయ్ చీరలంటే నాకు చాలా ఇష్టమని.. ఈసారి చీరలు కావాలంటే రాజమహేంద్రవరం వచ్చేస్తానని చెప్పడంతో అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు.. ఈలలు.. కేకలతో సందడి చేశారు.. దీంతో శ్రీలీల ఐ లవ్ రాజమహేంద్రవరం అంటూ లవ్ సింబల్‌తో ఇలా ఫోజిచ్చారు..



మేడంటే.. మేడా కాదు!

6



సీఎం సదస్సులో కలెక్టర్ ప్రశాంతి

గోదావరి జిల్లాలు వెనకబడ్డాయి!

- ప్రత్యామ్నాయ విధానంలో ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచాలి
- కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గోదావరి జిల్లాలపై సీఎం నారా చంద్రబాబు ఆసక్తికరమైన ,విలువైన వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో బుధవారం మొదలైన కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించి గ్రాస్ వేల్యూ యాడెడ్ (జీవీఏ) తగ్గిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జిల్లాలంటే పుష్కలంగా నీటితోనూ, సారవంతమైన భూముల తోనూ ఉంటాయని, రాయలసీమ కంటే బాగా ఉత్పత్తి సాధించే వన్నారు. ప్రస్తుతం రాయలసీమలో జీవీఏ పెరిగిందని.. గోదావరి జిల్లాల్లో తగ్గిపోయిం దన్నారు.తూర్పుగోదావరి జిల్లా 10వ స్థానంలో ఉండగా, కాకినాడ,కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో బాగా తగ్గినట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్లు బాగా దృష్టి పెట్టి ఏ పరిస్థితుల వల్ల జీవీఏ తగ్గిందో ఆరా తీసి అవసరమైతే సాగు లో ప్రత్యామ్నాయం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంట ఉండేటట్టు ప్రయత్నం చేయాలన్నారు. వ్యవసా యంతో పాటు ఆక్వా కల్చర్ కూడా బాగా పెంచాలని తెలిపారు.ముఖ్యంగా కాల్వలు సరిగా లేకపో వడం, కాలుష్యం పెరిగిపోవడం వంటి సమస్యల వల్ల కూడా పంటల ఉత్ప త్తిపై ప్రభావం పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లా డుతూ జిల్లాలో 450 ఎకరాల రైతులు ఆక్వాకు మారతామని దరఖాస్తు చేశారన్నా రు.వ్యవసాయ ఉత్పత్తి తగ్గిందని చెబుతున్నారని ఆమె తెలిపారు. ఇటువంటి భూములపై ముందు పీహెచ్ పరీక్షలు చేయాలని , సిబ్బది కొరత ఉందని, అందువల్ల రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో పిహెచ్ పరీక్షలు చేయించే ఆలోచన చేస్తున్నట్టు ఆమె వివరించారు.

నేడు నిడదవోలు రైల్వే గేటు మూసివేత

నిడదవోలు, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలు పట్టణంలోని రైల్వే గేటు 11వ తేదీ బుధవారం రాత్రి 10 గంటల నుంచి 12వ తేదీ రాత్రి 10 గంటల వరకు రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్టు రైల్వే అధి కారులు తెలిపారు. నిడదవోలు, తాడేపల్లి గూడెం వైపు రాకపోకలు సాగించే వాహ నదారులు నిడదవోలు మీదుగా సుబ్బ రాజుపేట,శింగవరం, తాళ్ళపాలెం మీదు గా రాకపోకలు సాగించవచ్చునన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం రెండు వైపులా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

అసర్ సర్వేపై శిక్షణ

నల్లజర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జరుగుతున్న అసర్ సర్వే విజయవంతం చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ డి.సోమసుందర్ అన్నారు.నల్ల జర్ల మండలం దూబచర్ల డైట్ కళాశాలలో బుధవారం- 2024 సంవత్సరానికి సంబం ధించి అసర్ సర్వే నిమిత్తం వలం టీర్లకు శిక్షణ ప్రారంభించారు. 3 నుంచి 16 ఏళ్ల వయసు గల పిల్లల వాస్తవ విద్యా స్థితిగ తులను పరీక్షించడానికి సర్వే చేపడుతున్నామన్నారు.దేశ వ్యాప్తంగా 30 వేల మంది వలంటీర్లు సర్వేలో పాల్గొం టారన్నారు. జిల్లాకు 30 గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని నిమిత్తం 60 మంది ఛాత్రోపాధ్యాయు లకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనీలు జి.సురేష్ బాబు,డి.రాజే ష్ మూడు రోజుల పాటు సర్వేపై శిక్షణ ఇస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ కమల కుమారి, అధ్యాపకులు రమ ణమూర్తి,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు



ఆహ్లాదమేదీ!

అధ్వానంగా పార్కుల నిర్వహణ

- జిల్లావ్యాప్తంగా 50 పార్కులు
- రాజమహేంద్రవరంలోనే 30
- కోట్లు ఖర్చుపెట్టారు..వదిలేశారు
- పాడైపోతున్న వస్తువులు
- కన్నెత్తి చూడని పాలకులు
- పట్టించుకోని అధికారులు
- సందర్శకుల అసహనం
- ప్రారంభంకాని చిల్డ్రన్స్ పార్కు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అలక్ష్యం వెరసి ఆహ్లాదం అటకెక్కిపోతోంది.. కోట్లాది రూపాయలు పెట్టి అందంగా తీర్చిదిద్దిన పార్కులు నేడు నిర్వహణ లేక పాడైపోతున్నాయి. అయినా అటు అధికారులు .. ఇటు పాలకులు వాటి ఊసే మర్చిపోయారు.. పర్యాటక శాఖ మంత్రి జిల్లాలోనే ఉన్నా వీటి నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో రాజమహేంద్రవరంలో ఆహ్లాదాన్ని పంచడానికి అందంగా తీర్చిదిద్దిన ఉద్యాన వనాలు రోజురోజుకు అధ్వానంగా మారిపోతున్నాయి.



అటకెక్కిన ఆహ్లాదం

జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి తదితర ప్రాంతాల్లో 50 వరకూ చిన్నా పెద్దా పార్కులు ఉంటాయి. ఉదయం,సాయంత్రం వేళల్లో పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అన్ని వయ సుల వారు కొద్దిసేపు సేదతీరతారు.ఈ నేపథ్యంలో కోట్లు ఖర్చు పెద్ద ఎత్తున పార్కుల ఆధునీకరణ చేశారు. గత ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల అవి ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోయాయి. పార్కు లైతే ఉన్నాయి కాని వాటిని వినియోగించే పరిస్థితి లే కుండా పోయింది.దానవాయిపేటగాంధీ పార్కును ఆధు నీకరణ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభి వృద్ధి చేశారు.కానీ ఉపయోగంలేదు.గతంలో కం బాల చెరువు పార్కు ప్రవేశం ఉచితం..ప్రతి రోజూ వంద లాది మంది పార్కులో వాకింగ్ చేసేవారు..సరదాగా గడిపే వారు. ప్రస్తుతం ఆ పార్కులోకి వెళ్లాలంటే పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20 ఉంది. దీంతో ఎవరూ వెళ్లేం దుకు ఆసక్తి చూపిం చడంలేదు. గ్లో పార్కు పరిస్థితి ఇలాగే ఉంది.గ్లో పార్కు లో చాలా లైట్లు వెలగడంలేదు. అయినా పట్టించుకునే వారేలేరు.దానవాయిపేట గాంధీ పార్కుదీ ఇదే పరిస్థితి. పార్కులో లక్షలు ఖర్చు పెట్టిన గ్రీన్ గ్రాస్.. గడ్డి మాదిరిగా ఎదిగిపోయి అందవిహీనంగా తయారైంది. ఏకేసీ కాలేజీ రోడ్డులో ఉన్న పార్కుల పరి స్థితి అలాగే ఉంది.గోదావరి బండ్ రోడ్డులో పీవీ.నరసిం హారావు పార్కులో కూడా ఆటపరికరాలు దెబ్బతిన్నాయి. కొవ్వూరు గోదావరి బండ్‌పై పార్కు చిట్టడవిలా ఉంది.

పార్కుల నిర్వహణ ప్రైవేటుకు వద్దు..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో సు మారు 30 పార్కులు ఉన్నాయి. వాటిలో ప్రజలు సేద తీరడానికి ఉపయోగపడేవి కేవలం 10లోపే పార్కులు ఉం టాయి. వాటిని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు.. ఉచిత ప్రవేశ ఎత్తివేయడంతో ప్రజలు సేదతీరేందుకు ఉద్యానవనాలతో ఉన్న పార్కులు దోహదపడడం లేదు. పైగా పార్కుల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే ఆలోచన అధికార యంత్రాంగంలో ఉన్నట్టు సమాచారం. ఈ విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మునిసిపల్ పార్కుల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదనే వాదన వినిపిస్తోంది.

పిల్లలకు ప్రవేశం లేదు.. వాహనాలకేనట!

ఇది పార్కా..వాహనాల పార్కింగా ప్లేసా అనుకుంటున్నారా.. ఇది పార్కేనండి బాబూ.. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మరీ తయారు చేయించారు. అధికారులకు ఖాళీ లేదో.. పాలకులకు ఖాళీ లేదో తెలి యదు కానీ ఇంకా ప్రారంభం కాలేదనుకోండి.. స్థానికులు మాత్రం ఎందుకు ఖాళీగా వదిలేయడమో ఏమో అనుకున్నారేమో ఇలా వాహనాల పార్కింగ్ ప్లేస్‌గా మార్చేశారు. ఇదెక్కడో మారుమూల కాదండోయ్.. రాజమహేంద్రవరం జాతీయ రహదారిని అనుకుని లాలాచెరువు వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోట్లు ఖర్చు చేసి నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కు పరిస్థితి ఇది. పార్కును అద్భుతంగా నిర్మించి చాలా కాలంగా మూసివేశారు. ఈ పార్కులోకి పిల్లలు వెళ్లడానికి వీలులేదు కానీ భారీ వాహనాలు పెట్టుకోవడానికి మాత్రం ఇలా తాళాలు తెరుచుకోవడం గమనార్హం.



చిల్డ్రన్స్ పార్కులో ఉన్న వాహనాలు







టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోండి

టీబీ రాష్ట్ర జేడీ డాక్టర్ రమేష్

కొవ్వూరు, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : క్షయ వ్యాధిగ్రస్తులను ఆరు నెలల పాటు దత్తత తీసుకుని న్యూట్రి షన్ ఫుడ్ బాస్కెట్లను అందజేయాలని టీబీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. రమేష్ సూచించారు. దొమ్మేరు పీహెచ్ సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అండ్ వెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధిగ్రస్తులు మం దులు సక్రమంగా వాడుతున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తాభియాన్ కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసు కోవాలన్నారు. ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హె చ్‌పీలకు సూచనలు అందజేశారు. అనంతరం సర్పంచ్ తానేటి కుమారి సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసుంధర, వైద్యాధికారులు ఎస్. ధర్మరాజు, సీనియర్ ట్రీట్‌మెంటు సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి,శ్రీనివాస్, పోతురాజు, వీర్రాజు, భీమరాజు,సమీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జనవరి 8 వరకు

రెవెన్యూ సదస్సులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ పరంగా ప్రజ లు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరి ష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల వారీ రెవెన్యూ సదస్సులు నిర్వ హిస్తోంది.భూ సమస్యలు, గత ప్రభుత్వం సర్వే సమయంలో చేసిన అవ కతవకలు తదితర అంశాలపై ఇప్పటికే ఆయా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన సంగతి తెలిసిందే.ఆయా సమస్యలు పరి ష్కరించనున్నారు.జిల్లాలోగురువారం నుం చి జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సభలు నిర్వహించనున్నారు.ఆ యా మం డలాల్లో రోజుకొకటి నుంచి మూడు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారు.

సెంట్రల్ జైలులో ఆర్డీవో విచారణ

ఖైదీ సుభాన్ ఒంటిపై దెబ్బలు లేవు..

బీడీ కాలుస్తుంటే మందలించారని వెల్లడి

రాజమహేంద్రవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సెం ట్రల్ జైలులో ఖైదీ సుభాన్‌ను డీఐజీ కొట్టి గాయపరిచారనే సంఘటనపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్‌ను విచారణకు ఆదే శించారు. ఆయన బుధవారం సెంట్రల్ జైలులో బాధితుడు సుభాన్, అక్కడ ఖైదీ లు,డీఐజీ, సూపరింటెండెంట్‌ను విచా రించారు. కానీ సుభాన్ శరీరం మీద ఎక్కడా దెబ్బలు కనిపించలేదని.. తనను కొట్టారని కూడా సుభాన్ చెప్పలేదని ఆర్డీవో తెలిపారు.డీఐజీ బంగ్లా వద్ద కాల్చిపడేసిన బీడీని తిరిగి తాను కాల్చి నపుడు డీఐజీ మందలించి సూపరింటెం డెంట్‌కు అప్పగించారని తెలిపాడన్నారు. సుభాన్‌ను అధికారులు భయపెట్టినట్టు సమాచారం. తనను ఎవరూ కొట్టలేదని, తానే బీడీ తాగడంతో అధికారులు తిరిగి సెంట్రల్ జైలు బ్యారక్‌లోకి పంపేశారని రాతపూర్వకంగా అతని చేత రాయించుకు న్నట్టు ప్రచారం జరుగుతోంది.

నాపై తప్పుడు ప్రచారం

డీఐజీ రవికిరణ్

తాను విధుల్లో కఠినంగా ఉండడం వల్లే తన కింద సిబ్బంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీఐజీ రవికిరణ్ తెలిపారు. వార్డర్లు, ఇతరులకు రెండు షిఫ్టుల డ్యూటీ వేశానని..విశాఖలో పలు వురిని సస్పెండ్ చేయించడంతో పాటు కొందరికి చార్జిమెమోలు ఇచ్చానని అం దుకే తనపై కక్షకట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సుభాన్ అనే ఓపెన్ జైలు ఖైదీ బీడీ తాగుతున్నా డని ఎవరో వచ్చి తనకు చెబితే తాను మరో వార్డర్‌కు చెప్పి సూపరింటెండెంట్ వద్దకు పంపాన న్నారు.తన బంగ్లాలో అతనేమీ పనిచే యడంలేదని.. తానేమీ కొట్టలేదన్నారు. నెల్లూరులో కూడా తప్పుడు ప్రచారం చేశారని..చివరకు సీఐడీ విచారణలో అం తా తప్పని తేలిందన్నారు.

అధికారుల ఇళ్లల్లో పనిచేయరు

సూపరింటెండెంట్ రాహుల్

అధికారుల ఇళ్లలో ఖైదీలెవరూ పనిచే యరని.. ఓపెన్ జైలు ఖైదీలతో కారాగా రభూములు,భవనాలు, అధికారులు ఉం టున్న క్వార్టర్స్ వద్ద పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించడం వంటి పనులు చేస్తారని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కె.రా హుల్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సుభాన్ బీడీ కాల్చడం వల్ల అతన్ని తిరిగి బ్యారక్‌లోకి పంపించామన్నారు.ఎవరూ కొట్టలేదని గాయాలు కూడా లేవన్నారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

7



వాదాలకుంటలో కుళ్లిన పొగాకు నారు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

ఎదుగుదల లేని పొగాకు

వాతావరణమే కారణమన్న శాస్త్రవేత్త

గోపాలపురం,డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): పొగాకు రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు అధికారులను సంప్ర దించి తగు సూచనలు తీసుకుని సాగు చేయాలని సీటీఆర్ఐ శాస్త్రవేత్త హెచ్‌ఎస్. మహేష్ అన్నారు. మండలంలోని వాదా లకుంట తదితర గ్రామాల్లో పొగాకు తోటలను బుధవారం పరిశీలించి మాట్లా డారు.వాతావరణంలో మార్పులతో మొక్కల ఎదుగుదల లోపించిం దన్నారు. సహజంగా వర్జీనియా పొగాకు తోటలకు ఎండతో కూడిన వాతావరణం అనుకూ లమైందన్నారు.వాతావరణ మా ర్పులతో ఎదుగుదల లేక పోవడంతో వాదాలకుంట గ్రామానికి చెందిన ఉండ వల్లి రాజు అనే రైతు 27 ఎకరాల పొగాకు తోటను దున్ని వేశారన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు మొక్కలకు సోకిన తెగుళ్లను నియంత్రి ంచడానికి రేడా మిల్ గోల్డ్ ఎకరానికి అర కేజీ పిచికారీ చేసి తెగుళ్ల విస్తరించ కుం డానియంత్రించవచ్చన్నారు.ఆయన వెంట శ్యామ్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ కేఆర్. మీనా, ఫీల్డ్ ఆఫీసర్ కీర్తికుమార్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
విలేకరులు కావలెను
1. కాకినాడ (స్టాఫ్ రిపోర్టర్)
మండలాల రిపోర్టర్ల ఖాళీలు :
1. అమలాపురం అర్బన్ 2. రామచంద్రపురం
3. మండపేట రూరల్ 4.కాజులూరు 5. పెదపూడి
6.కాకినాడ జగన్నాథపురం 7. కాకినాడ మసీదు సెంటర్
8.మధురపూడి 9. రాజమహేంద్రవరం కలెక్టరేట్
10. బొమ్మూరు
ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.
అభ్యర్థులు ఇంటర్ / డిగ్రీ చదివి వుండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి.
పైన పేర్కొన్న అర్హతలున్న అభ్యర్థులు
తేది 13-12-2024 (శుక్రవారం)
ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను
అడ్రస్ : ఆంధ్రజ్యోతి కార్యాలయం
దివాన్‌చెర్వు, వెలుగుబంద రోడ్, పాలచర్ల పంచాయతీ
ఫోన్ : 99854 11242

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 1
పాఠకుని పూర్తి పేరు : ....
డోర్ నెంబరు : ....
వీధి పేరు : ....
గ్రామం / పట్టణం : ....
మండలం : ....
జిల్లా : ....
పోస్టల్ పిన్‌కోడ్ : ....
ఫోన్ నంబర్ : ....
నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.
నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, డో.నెం.114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్డు, పాలచర్ల (గ్రామం), రాజానగరం మండలం, రాజమహేంద్రవరం పిన్-533 102.
బ్రాంచ్ మేనేజర్ : 9985411241, సర్క్యులేషన్ మేనేజర్ : 9985411247

దివాణం కోట










దివాణం గేటు.. కోట లోపల ఊగుటుయ్యాల.. మంచం.. దివాణం హాలులో నగిషీలు చెక్కిన ఫర్నిచర్



చెక్కు చెదరని చరిత్ర

- కపిలేశ్వరపురం జమిందారీ సంస్థానానికి వందల ఏళ్ల చరిత్ర
- దివాణం నిర్మాణానికి 144 ఏళ్లు
- ఇప్పటికీ అదే రాజసంతో దర్శనమిస్తున్న ఎస్టేట్
- అలనాటి జ్ఞాపకాలుగా ఫర్నిచర్, ఇతర సామగ్రి



బుచ్చి సర్వారాయుడు



సత్యన్నారాయణరావు



(ఆంధ్రజ్యోతి- మండపేట)

ఇప్పుడు రాజ్యాలు లేవు. వలస పాలకులూ లేరు. వీరికి, ప్రజలకు అనుసంధానంగా కొనసాగిన జమిందారీ వ్యవస్థా నేడు లేదు. కానీ జమిందారీ వ్యవస్థ నాటి వైభవానికి సజీవ సాక్ష్యాలు ఉన్నాయి. జమిందార్లు లేకపోయినా వారు నివసించిన దివాణాలు ఉన్నాయి. వారి వారసుల సంరక్షణలో జమిందారులు వినియోగించిన వస్తు సామగ్రి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఒక్కొక్క జమిందారీ దివాణం ఒక్కో చరిత్ర. కపిలేశ్వరపురం జమిందారీ దివాణం కూడా అందులో ఒకటి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామంలో జమిందార్ కుటుంబానికి సంబంధించిన దివాణం భవనాలు నేటికీ పదిలంగానే ఉన్నాయి. 1880లో నిర్మించిన దివాణం భవనాలు ఆనాటి నిర్మాణం పనితనం, నైపుణ్యానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఇక్కడ జమిందార్ దివాణం గోదావరి నది చెంతనే ఉంది. సాధారణంగా జమిందార్లు అంటే మొత్తంగా భూయజమాన్య హక్కులు కలిగినవారు. అభివృద్ధిలోను, రైతుల నుంచి పన్నుల వసూళ్లలోను కీలక భూమిక వహించేవారు. అలాగే సాహిత్య, సాంస్కృతిక కళలకు రాజపోషకులు. కపిలేశ్వరపురం జమిందార్లు కూడా తమ హయాంలో సాంస్కృతిక వైభవానికి పునాదులు వేశారు. వాటిలో భాగమే వేద పాఠశాల, హరికథ పాఠశాలలు ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కపిలేశ్వరపురం ఎస్టేట్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఎస్టేట్‌ను సంపాదించిన బలుసు వంశీయులు, 1635లో దుర్జయ వంశస్థులు కాకతీయ రాజ సంతతికి చెందిన శ్రీబలుసు నాగినీడు తొలి జమిందార్‌గా వ్యవహరించారని పూర్వపు చరిత్ర చెబుతోంది. ఆ తర్వాతకాలంలో బ్రిటీష్ పాలనలో ఆంగ్లేయుల నుంచి 1818లో బలుసు పెద సర్వారాయుడు ఈ జమీ పొందారు. కపిలేశ్వరపురం జమీలో ఆరు శివారు లంకలు ఉండేవి. 1847లో పెదసర్వారాయుడు చనిపోగా, ఆయన కొడుకు బుచ్చి కృష్ణయ్య పాలనకొచ్చారు. ఆయన 1852లో ఆరు గ్రామాలు ఉన్న కేశనకుర్రు సంస్థానాన్ని రాజా దంతులూరి బుచ్చి కృష్ణంరాజు నుంచి కొనుగోలు చేసి విస్తరించారు. ఎన్నో ప్రజా కార్యక్రమాలు చేపట్టారు. బుచ్చి కృష్ణయ్య 1857లో చనిపోయారు. తర్వాత జమిందార్ అయిన ఆయన సోదరుడు పట్టాభిరామయ్య 1866లో చనిపోయారు. ఆయన భార్య రామలక్ష్మమ్మ తన పాలనలో పెద్ద సత్రం నిర్మించి అనేక సేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆమె దత్తపుత్రుడు పట్టాభిరామయ్య 1896లో చనిపోగా, మరో ఇద్దరి సంరక్షించింది. 1906లో ఈమె చనిపోగా, బలుసు బుచ్చిసర్వారాయుడు జమిందార్ అయ్యారు. ఈయన 1913లో పెద్ద పాఠశాల నిర్మించి జిల్లా బోర్డుకు అప్పగించారు. ఆంగ్లేయుల ఇంపీరియల్ వ్యవసాయ పరిశోధనా సంఘానికి సభ్యుడు. చాగంటి శేషయ్య గారి రాధామాధవము, ఆంధ్ర కవితరంగిణి, సుగ్రీవ విజయము అనే గ్రంథాలను ముద్రింపజేశారు. జిల్లా బోర్డు అధ్యక్షుడిగానూ పనిచేశారు. హసనాబాద్ గ్రామాన్ని సంపాదించారు. 1945లో బ్రిటిష్ ప్రభుత్వం ఈయనకు రావు బహద్దూర్ బిరుదు నిచ్చింది. ఈ బలుసు బుచ్చి సర్వారాయుడు, లక్ష్మీ వెంకట సుబ్బామ్మారావు దంపతుల కుమారులు ఎస్‌బీ ప్రభాకర పట్టాభిరామారావు, ప్రభాకర వెంకట రామ్మోహనరావు, ప్రభాకర వెంకట చలపతి రావు, ఎస్‌బీపీబీకే సత్యనారాయణ రావు (చంటి దొర). వీరిలో ప్రభాకర రామ్మోహనరావు మద్రాసులో చదువుకుంటుండగా 17 ఏట మరణించారు. వీరిలో పట్టాభిరామారావు, సత్య నారాయణరావులు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మంత్రు లుగా పని చేశారు. ఇద్దరూ కేంద్ర సహాయ మంత్రులుగా పనిచేయడం విశేషం. చలపతిరావు వ్యాపార రంగంలో రాణించారు. ఎంతో వైభవాన్ని పదిలపర్చు కున్న కపిలేశ్వరపురం దివాణంలో నిర్మించిన భవనానికి 144 ఏళ్లు. ఇది 1880లో నిర్మించారు. అయినప్పటికీ ఇప్పటికీ రాజసానికి చిహ్నాలుగా నిలిచే ఉన్నాయి. భవనాలే కాకుండా ఫర్నిచర్, వారు వినియోగించిన వస్తువులు అపురూపమైన సంపదగా నిలుస్తున్నాయి. ఆనాటి నిర్మాణాలు అప్పటి వారి నైపుణ్యానికి సాక్షీభూతంగా దర్శనమిస్తున్నాయి. ఈ జమిందారీ సంస్థానం మిగిలిన జమిందారీ వ్యవస్థలకన్నా భిన్నం. ఇది ప్రజలతో మమేకమైన సేవా సౌధం.

రాజమహేంద్రిలో సినీ నటి శ్రీలీల సందడి

ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం





చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న శ్రీలీల, బంగారు ఆభరణాలతో సందడి చేస్తున్న శ్రీలీల

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. 5 ఫ్లోర్లలో సువిశాలంగా దీనిని నిర్మించారు. చీరలు, డ్రెసెస్‌లు, మెన్స్‌వేర్ అన్ని రకాల వస్త్రాలతో అద్భుతమైన రంగులతో ఆఫర్ ధరలతో వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ఈ షాపింగ్ మాల్‌ను సినీ నటి శ్రీలీల ప్రారంభించారు. తొలుత శ్రీలీలకు చెన్నయ్ షోరూం నిర్వాహకులు ఎం.జనార్దన్‌రెడ్డి, జమున, ఎం.వెంకటరెడ్డి, మధులత స్వాగతం పలికారు. అన్ని ఫ్లోర్లలో వస్త్రాలను, జ్యుయలరీ విభాగాన్ని శ్రీలీల పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభించడానికి రాజమహేంద్రవరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాకు నచ్చిన రంగుల వస్త్రాలు చెన్నయ్ షాపింగ్ మాల్‌లో లభ్యమవుతున్నాయన్నారు. ఇటువంటి వాటి కోసం గతంలో చెన్నై వెళ్లాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్స్‌లో లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. తాను నటించిన రాబిన్‌హుడ్ సినిమా ఈ నెల 25న విడుదల కాబోతుందని ప్రేక్షకులు విజయవంతం చేయాలన్నారు. శ్రీలీలను చూడానికి వచ్చిన జనంతో ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డు కళకళలాడింది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసి 600మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర ప్రముఖులు హాజరయ్యారు.



రాజమహేంద్రవరంలో వీరేశలింగం పంతులు నివాసంలో జరిపించిన తొలి వితంతు వివాహానికి గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఆంధ్ర కేసరి యువజన సమితి సభ్యులు

తొలి వితంతు వివాహానికి 143 ఏళ్లు

నాడు రాజమహేంద్రవరంలో ఆదర్శ వివాహాలకు వీరేశలింగం నాంది

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వితంతు వివాహాలను ప్రోత్సహించి సంఘసంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వీరేశలింగం పంతులు ధన్యజీవి అని ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. తొలి వితంతు వివాహం జరిపిన రోజును 143 ఏళ్ల తర్వాత బుధవారం కందుకూరి వీరేశలింగం జన్మ గృహంలో నిర్వహించారు. ముక్కుపచ్చలారని బాలికలను, కాసుల మీద ఆశతో పండు ముసలివారికిచ్చి పెళ్లి చేసే సంప్రదాయాన్ని వీరేశలింగం పంతులు బద్దలుకొట్టారన్నారు. నాటి నుంచి సంఘ సంస్కరణ ఉద్యమానికి సమాజంలో బీజాలు పడ్డాయని తెలిపారు. తొలి వితంతు వివాహం జరిగి 143 ఏళ్లయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, కళారత్న పీవీఎస్.కృష్ణారావు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు కె.తిమ్మరాజు,పురావస్తు శాఖ ఉద్యోగి మూసా, ఆంధ్రకేసరి యువజన సభ్యులు దూర్వాసులు సత్యనారాయణ, గుడిపూడి సునీల్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

21న ఉమ్మడి జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు


కాకినాడ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, 1 నుంచి 7వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఈ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు,స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా సంఘాల చైర్మన్‌లు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఒక ప్రకటనలో కోరారు.

ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ సముద్రం మాత్ర ప్రశాంతంగా ఉండటం గమనార్హం. అయితే బుధవారం ఉదయం సముద్రంపైకి వేటకు వెళ్లిన మత్స్యకారులు మధ్యాహ్నానికి ఒడ్డుకు చేరుకున్నారు.

తగ్గేదెలే...!

- కలపను వస్తువులుగా తయారుచేసి తరలిస్తున్న ఉన్నతాధికారి
- లారీని అడ్డుకున్న గ్రామస్తులు



భారీగా టేకు కలపతో పట్టుబడ్డ లారీ

కూనవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో కంచె చేను మేస్తోంది. కొంత మంది అటవీ శాఖాధికారులే స్మగ్లర్ల అవతారమెత్తి భారీగా టేకు కలపను రవాణా చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ శాఖాధికారిణి (ఎఫ్‌ఆర్‌వో) మోహిని విజయలక్ష్మి నందిగామలో భారీగా టేకు కలప తరలిస్తూ పట్టు బడ్డారు. వాటి విలువ లక్షల్లో ఉంటుందని అంచనా. మోహిని విజయలక్ష్మి అల్లూరి సీతారామ రాజు జిల్లా కూనవరం ఎఫ్‌ఆర్‌వోగా పనిచేస్తూ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. అయితే ఆమె ఈ ప్రాంతంలో విలువైన టేకు, జిట్రేగి ఉండడంతో వాటిని ఇక్కడి నుంచి ఆమె స్వగ్రామమైన తిరువూరుకు తరలిస్తున్నారని గతంలో వార్తలొచ్చాయి. తరలించిన టేకు కలపను అక్కడ లక్షల్లో విక్రయించారన్న విమర్శలు వచ్చాయి. గతంలోను ఆమె టేకు కలప తరలిస్తూ సీసీ ఫుటేజ్‌లో సైతం కనిపించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మోహిని విజయలక్ష్మి 3 రోజులుగా కూనవరంలో తిష్ట వేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గతంలో ఆమె పనిచేసిన సమయంలో పట్టుబడ్డ కలపను వస్తువులుగా తయారుచేసి ఆమె బుధవారం తరలిస్తుండడంతో నందిగామలో గ్రామస్తులు లారీని అడ్డుకున్నారు. దీంతో లారీపై టార్పాలిన్ తెరవగానే లక్షల్లో విలువచేసే కలప ఉండడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

'పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం ఉమ్మడి ప్రణాళిక'

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం సీటీఆర్‌ఐ, ఐజుసీఎల్ ఉమ్మడి ప్రణాళిక రూపొందించినట్టు సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ తెలిపారు. బుధవారం సీటీఆర్‌ఐలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఇండియన్‌ఆయాల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నారు. వర్జీనియా పొగాకులో కలపకు బదులుగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) క్యూరింగ్ విధానానికి వాడుకునేందుకు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం, పరిశోధనలు వేగవంతం చేసేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 40వేల పైచిలుకు ఉన్న పొగాకు బ్యారన్‌లలో ఉపయోగించే కలపను గణనీయంగా తగ్గించుకోవచ్చని రైతులకు కలప సంబంధిత సమస్యలు, ఖర్చు తగ్గుతాయన్నారు. సమావేశంలో ఇండియన్ అయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ జీఎం యోగరాణి సురేష్, చీఫ్ మేనేజరు పీవీ లలిత, మేనేజరు డిభాస్కర్, అసిస్టెంట్ మేనేజరు విగోపాల్ పాల్గొన్నారు.

మహాసంస్థానంలో

లక్ష తులసి అర్చన



శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు బుధవారం విశేషపూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రుత్విక్కులు తులసి దళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూ క్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకి సేవ కనులపండువగా నిర్వ హించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్ల ప్రతిభ

ప్రథమస్థానంలో పురుషుల జట్టు

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పదోవ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు ప్రతిభ కనబరిచాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 4రోజులు పాటు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితానీ సత్యనారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మజ బహుమతులు, షీల్డులు బహుకరించారు. విజేతలుగా నిలిచిన ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు(అయలు), జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు మొగలి కాశీవిశ్వనాథం అభినందించారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా పురుషుల, మహిళల జట్ల సభ్యులు

తండ్రి మందలిస్తాడనే భయంతో
విద్యార్థి ఆత్మహత్య


జిల్లెల్ల బన్నీ

మలికిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలిస్తాడనే భయంతో ఓ విద్యార్థి కంగారులో చింతలమోరిలోని శంకరగుప్తం డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. దీనికి సంబంధించిన వివరాలివి. కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరి జడ్పీ హైస్కూలులో జిల్లెల్ల బన్నీ (15) అనే బాలుడు 9వతరగతి చదువుతున్నాడు. ఈనెల 10న ఇంటినుంచి వెళ్లి అతడు తిరిగి రాలేదు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో తల్లిదండ్రులు మలికిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం సాయంత్రం శంకరగుప్తం డ్రెయిన్‌లో అతడి మృతదేహాన్ని చూసిన స్థానికులు వారికి సమాచారమిచ్చారు. బన్నీ తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధ పడుతుండగా తల్లి కుటుంబాన్ని పోషిస్తోంది. తండ్రి మందలిస్తాడనే భయంతోనే అతడు డ్రెయిన్‌లో దూకేసి ఉంటాడని చెప్తున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆరేపల్లి అనిల్ ఈనెల 10న రాత్రి కాతేరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. పంగిడి హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్దకు చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిన అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.108అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో రంగంపేట మండలంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రంగంపేట ఎస్‌ఐ తోటకృష్ణసాయి తెలిపిన వివరాలప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన కురుకూరి అన్నవరం స్థానికంగా చికెన్‌షాపు నిర్వహిస్తున్నాడు. చికెన్‌షాప్‌లోఉన్న బాక్స్‌కి కరెంట్ ఉన్న విషయం తెలియక బుధవారం అతడు దాన్ని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి కింద పడిపోయాడు. అతడి భార్యకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో బంధువుల సహాయంతో రామహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం అమ్మిన సొమ్ములు ఖర్చు చేయడంపై వివాదం

» పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

ఎటపాక, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన సొమ్ములు భర్త ఖర్చు చేయడంపై దంపతుల మధ్య వివాదం తలెత్తి క్షణికావేశంలో భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట గ్రామానికి చెందిన గుండి నాగేష్ (56) ఇటీవల పండించిన ధాన్యంలో నాలుగు బస్తాలను అమ్మి ఆ డబ్బులు ఖర్చు చేశాడు. దీంతో బుధవారం భార్య రామమ్మ ఎందుకు ధాన్యం అమ్మిన డబ్బులను ఖర్చు చేశావని నిలదీసింది. క్షణికావేశంలో ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. నాగేష్‌ను వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. భార్య రామమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి బీమా!

» పంటల బీమాలో మామిడికి స్థానం
» రైతులకు ప్రభుత్వం తీపి కబురు
» ఎకరాకు ప్రీమియం కింద రూ.2,000 చెల్లించాలి
» పంటనష్టం జరిగితే ఎకరాకు రూ.40వేల పరిహారం
» ఈనెల 15తో ముగుస్తున్న గడువు



సామర్లకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నో దశాబ్దాలుగా మామిడి రైతులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. ఈ మేరకు మామి డి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్(రీస్ట్రక్చర్ వెదర్ బేస్‌డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు గణనీయంగా ఉప శమనం లభించనుంది. కూటమి సర్కారు తీసు కున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంతోపాటు జిల్లాలోని మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా సాగు

ఉమ్మడి తూర్పు జిల్లాలో గణనీయంగానే మామిడి సాగు ఉంది. కాకినాడ జిల్లాలో 18,252 ఎకరాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో 20,500 ఎకరాల్లోను, కోనసీమలో 12,000 ఎకరాల్లోను మామిడి సాగు జరుగుతోంది. ఈ పంట మీద 10వేలమంది రైతులు ఆధారపడి ఉన్నారు. కాకినాడ జిల్లాలో తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, జగ్గంపేట, పెద్దాపురం మండలాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో రంగంపేట, రాజానగరం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో, కోనసీమలోను పలుచోట్ల మామిడితోటల సాగు జరుగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మామిడితోటల సాగు గణనీయంగా పెరిగింది. కానీ బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పంటకు బీమా వర్తింపచేయాలని ఏళ్ల తరబడి రైతులు పోరాడుతున్నారు. వారి పోరాటం ఫలించి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లో చోటు

అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతోపాటు ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు రాష్ట్రంలో రబీ సీజన్(2024-25)లో పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాన్ని మామిడికి వర్తింపజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా ఉద్యానవనశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలవుతున్న జిల్లాల్లో కాకినాడ జిల్లాకు కూడా చోటు దక్కింది.

ఐదేళ్ల ముందు తోటలకే వర్తింపు

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అమలవుతున్న 15 జిల్లాల్లో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం వేర్వేరుగా నిర్ణయించింది. కాకినాడ జిల్లాలోని మామిడి రైతులు ఎకరాకు రూ.2వేల చొప్పున ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.40వేల నష్టపరిహారం లభించే అవకాశం ఉంది. ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 2020, అక్టోబరు 1 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

దశాబ్దాల ఆకాంక్ష

మామిడి పంటకు బీమా సదుపాయం కల్పించాలని దశాబ్దాలుగా రైతులనుంచి డిమాండ్ ఉంది. వాతావరణంలో ఏర్పడే మార్పుల కారణంగా ఎక్కువ నష్టపోయేది మామిడి రైతులే.

బీమా ఎప్పుడు.. ఎలా వర్తిస్తుందంటే..

అకాల లేక అధిక వర్షం:	15.12.2024 నుంచి 28.02.2025
చీడపీడల వాతావరణం: (ముసురు, తేమ)	15.12.2024 నుంచి 28.02.2025
ఉష్ణోగ్రతలో వ్యత్యాసం:	01.01.2025 నుంచి 15.03.2025
అధిక గాలి వేగం:	01.03.2024 నుంచి 31.05.2025

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఒక్కో రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేయించుకోవచ్చు. భూమి పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్, బ్యాంకు ఖాతా జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంక్ లేదా కామన్ సర్వీసు సెంటర్ లేదా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

బీమా పథకంవల్ల వారి నష్టాలను కొంతవరకైనా పూడ్చుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

15 లోపు ప్రీమియం చెల్లించాలి

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కోసం రైతులు ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించినరోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంటనష్టం కూడా 2024, డిసెంబరు 15 నుంచి 2025, మే 31 మధ్యకాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, తేనెమంచు, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలివేగం, చీడ పీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండలస్థాయి అధికారులు నష్టాన్నిలెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు.

-మల్లిఖార్జున్, ఉద్యానశాఖాధికారి, కాకినాడ

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

» 70 గ్రాముల బంగారం అపహరణ
» రాయవరం మండలంలో ఘటన


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్‌ఐ బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లాలోని రాయవరం మండలం చెల్లూరులోని బొడ్డువారికూడలిలో బలుసు రమాదేవి అనే మహిళ నివసిస్తోంది. ఆమె భర్త మరణించగా కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది.ఆమె తన తల్లికి అనారోగ్యంగా ఉండడంతో ఈనెల 4న తల్లిని చూసేందుకు ఇంటికితాళం వేసుకుని వెళ్లింది. ఈనెల 9వతేదీ సాయంత్రం 6 గంటలకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం తెరిచి ఉండడం.. ఇంట్లో ధాన్యం అమ్మకాలు జరపగా వచ్చిన కొంత నగదుతోపాటు 30 గ్రాముల బంగారు గొలుసు, 40 గ్రాముల బంగారు గాజులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు బాధితురాలు రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీం పరిశీలించింది.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెడువ్యాసనాలకు బానిసలైన యువకులు, బాలలు కలిసి 29 బైక్‌లు, స్కూటీలను చోరీ చేశారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. దొంగిలించిన బైక్‌లు మాత్రం నాలుగు జిల్లాల పరిధికి చెందివని కావడం గమనార్హం. ఈ మేరకు రాజమహేంద్రవరం త్రీటౌన్‌లో బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కాతేరు గామన్ బ్రిడ్జి రోడ్డులో ఈనెల 11న వాహనాల తనిఖీ చేస్తుండగా 16నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల నలుగురు యువకులు రెండు మోటార్ సైకిళ్లపై వెళ్తూ పోలీసులను చూసి వెనక్కి పారిపోతుండగా వెంటాడి పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా రాజమహేంద్రవరం వీకర్స్ కాలనీకి చెందిన కుప్పం తేజ(19)తోపాటు మరొక ముగ్గురు బాలలను గుర్తించామన్నారు. వీరితోపాటు ఈ బైక్ దొంగతనాలకు పాల్పడిన రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన శ్రీరామ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ ఐదుగురు కలిసి జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌లు స్కూటీలు దొంగిలించారని తెలిపారు. వీరు దొంగిలించిన బైక్‌లను

నాలుగు జిల్లాల్లో 29 బైక్‌లు చోరీ
నలుగురి అరెస్టు.. వీరిలో ముగ్గురు బాలలే
మరొక నిందితుడు పరారీ

కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్నలకు విక్రయించారని తెలిపారు. కొన్ని బైక్‌లను రాజమహేంద్రవరం క్వారీ గోతుల్లో దాచిపెట్టారని చెప్పారు. ఈ ఐదుగురు దొంగలు కలిసి త్రీటౌన్ పరిధిలో 12 బైక్‌లు, ప్రకాష్‌నగర్, రాజానగరం, కోరుకొండ, ధవళేశ్వరం, కడియం, అవిడి, నిడదవోలు, ప్రత్తిపాడు, ఏలూరు ప్రాంతాల్లో స్కూటీలను అపహరించారని తెలిపారు. ఈ దొంగ బైక్‌లు కొనుగోలు చేసుకున్న వారిపైన సెక్షన్ 4 (11)కింద కేసులు నమోదు చేశామన్నారు. దొంగిలించిన బైక్‌ల విలువ రూ.11.60 లక్షలు ఉంటుందన్నారు. నిందితుల్లో ముగ్గురు బాలలను జువైనల్ కోర్టుకు, మరొకరిని రిమాండ్‌కు పంపించామని, ఇంకొకరు పరారీలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ వి.అప్పారావు, ఎస్‌ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

వెయ్యి కిలోల గంజాయి పట్టివేత


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కన్నపరాజు

» ఒడిశా నుంచి హరియాణాకు తరలిస్తుండగా కూనవరంలో స్వాధీనం
» ముగ్గురి అరెస్టు

కూనవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒడిశానుంచి హరియాణాకు వెయ్యి కిలోల గంజాయితో వెళ్తున్న లారీని పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎటపాక సీఐ కన్నపరాజు తెలిపిన వివరాలివి. పశ్చిమ బెంగాల్ నుంచి ఓ లారీ బియ్యం లోడుతో ఏపీలోని కాకినాడలో సరుకు దిగుమతి చేశారు. ఆ లారీ వైజాగ్ వెళ్లింది. అక్కడ ఐరన్‌ఓర్ లోడు చేసుకుని అక్కడినుంచి ఒడిశా వచ్చింది. ఒడిశాలో కలిమిలా దగ్గర ఎంవీ 81 అడవిలో అదే ప్రాంతానికి చెందిన సమాల్‌దేవ్ అనే వ్యక్తిని పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు కలిశారు. అక్కడ గంజాయి కొనుగోలు చేసి ఐరన్‌ఓర్ కింద లోడ్ చేసుకుని బయలుదేరారు. అక్కడి నుంచి ఏపీలోని చట్టీ రాగానే పోలీసులు ఏడురాళ్లపల్లి మీదుగా వెళ్లాల్సిన వాహనాలను కూనవరం వైపు మళ్లించారు. అప్పటికే పోలీసులు పక్కా సమాచారంతో కూనవరం మండలంలో జగ్గవరం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బుధవారం ఈ లారీ పట్టుబడింది. దీంతో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌తో పంచనామా నిర్వహించారు. 25కిలోలు ఉండే 40 బ్యాగుల్లో ఈ గంజాయిని స్మగ్లర్లు ఎగుమతి చేస్తున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు షేక్ షంలిన్, షేక్ అక్తర్‌తోపాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంవీ 81 గ్రామానికి చెందిన సమాల్ దేవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. కూనవరం ఎస్‌ఐ లతశ్రీ, ఏఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పులి జాడ కోసం అటవీ సిబ్బంది వెతుకులాట


బాపన్నదొర అటవీప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ట్రాప్ కెమెరా

ప్రత్తిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో సంచరిస్తున్న పులిజాడకోసం బుధవారం అటవీశాఖ సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు కొనసాగించారు. నాలుగైదురోజులుగా ఈ అటవీప్రాంతంలో తిష్ట వేసిన పెద్దపులి కదలికలపై అటవీ సిబ్బంది సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో కలియ తిరుగుతు న్న ఈ పెద్దపులిని ఇబ్బందికరమైన చర్యలు తీసుకోకూడదనే నిర్ణయానికి అటవీశాఖాధికారు లు వచ్చారు. బురదకోట 3,4 కిలోమీటర్ల పరిసరాల్లోనే పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండురోజుల్లోను మండలంలోని రౌతుపాలెం తోటల్లో పులి సంచరించినట్లు ఆ రైతులు చెబుతున్నారు. రౌతుపాలెం, పాండవులపాలెం, కిత్తమూరుపేట, పొదురుపాక, తాడువాయి, దోపర్తి పరిసరాల్లో కూడా పులి సంచరించినట్లు సమాచారం. దీంతో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పులి కదలికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌ను అనుకుని ఉన్న గిరిజనులు పశువులను, అటవీప్రాంతంలోకి తరలించవద్దని, ఒంటరిగా అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో ఏలేశ్వరం రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు బుధవారం గాలింపు చర్యలు చేపట్టినా పులి ఆచూకీ తెలియరాలేదు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత


సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితుల్లో కొందరికి బుధవారం అందజేశారు. మొత్తం 34 సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పట్టుకున్నారు. వాటి విలువ రూ.7,04,600 ఉంటుందని తుని రైల్వే ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సెల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి రాజమహేంద్రవరం డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు అందజేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

» నన్నయ వీసీ శ్రీనివాసరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సుధాకర్


సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

దివాన్‌చెరువు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): యువత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సూచించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువఉత్సవ్ కార్యక్రమం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. యువత సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టిసారిస్తే ఆరోగ్యం, ఆనందం కలుగుతాయన్నారు. యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. నెహ్రూ యువజన కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్ పెయింటింగ్, పద్యాలు, రాయడం, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368

AJB -225408

స్లాబు లీకేజి రిపేర్

స్లాబు లీకేజి, బాత్‌రూమ్ లీకేజి, గోడ చెమ్మలు మొ॥ వాటిని ఆధునిక కెమికల్స్‌తో గ్యారంటీగా నివారించబడును. BVT Groutings, KKD & RJY సెల్:95534 16516, 95029 66504

Ajd:21

EDUCATION

» BPT/B. Sc .MLT COURSES IN VIJAYAWADA -ELIGI:INTER BI.PC/ VOC MLT/ INTER WITH BI.PC BRIDGE COURSE-RECOG.BY DR.NTRUHS & PARAMEDICAL COUNCIL - SCHOLARSHIPS & HOSTELS AVAILABLE ✆ 78936 74699

AJB - 225275

4 Lines CLASSIFIED Rs.230/- Only


వివాహిత దేవి మృతదేహం.. దేవి(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడాదికే వివాహిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన కొవ్వూరులో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీకి చెందిన నేతల దేవి (21) స్వస్థలం కాకినాడజిల్లా తొండంగి మండలం చిన్నాయిపాలెం. బుధవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకుముందు భర్త వీరబాబుకు ఫోన్ చేసి చికెన్ తెమ్మని చెప్పింది. అతడు చికెన్ పట్టుకుని వచ్చి వీరబాబుకు భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. కిందకు దింపే సరికి మృతి చెందిందని, ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో గత నెలలో 20రోజులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించామని వీరబాబు తెలిపాడు. వీరికి వివాహం జరిగి ఏడాది కావస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇప్పటివరకు బాధితులనుంచి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

హెరిటేజ్ పాల రైతులకు రూ.125కోట్ల రుణాలు

» సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు



కోటనందూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం ద్వారా దేశంలోని 12రాష్ట్రాల్లో రైతులకు రూ.125కోట్లు రుణాలు అందించామని సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం కాకినాడ జిల్లాలోని కోటనందూరు హెరిటేజ్ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది ఇంతవరకు 10వేల మందికి రుణాలిచ్చామన్నారు. దేశంలో ని 12 రాష్ట్రాల్లో రోజుకు 19 లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నామని, ఈ పాలను 15లక్షల కుటుంబాలకు అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. రాబోయేరోజుల్లో ప్రతిఏటా 3లక్షలలీటర్ల పాల ఉత్పత్తిని పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు. 3లక్షలమంది రైతులకు గ్రూప్ ఇన్స్‌రెన్స్ ఏర్పాటుతోపాటు పాలరైతులకు తక్కువ ధరకే పశుదాణా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో 9500 పాలసేకరణ కేంద్రాల ద్వారా 19 ప్రాసెసింగ్ యూనిట్‌లకు పాలసేకరణ చేస్తున్నామని తెలిపారు. ఆ సమావేశంలో హెరిటేజ్ హెడ్ ప్రొక్యూర్‌మెంట్ ఇన్‌పుట్స్ ఎస్.రామ్మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వి.దివాకర్ ఉన్నారు.

అనారోగ్యంతో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఒడిశాకు చెందిన దాశరథి మహాపాత్ర (40) అనారోగ్యంలో మరణించాడు. వన్‌టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన మహాపాత్ర ఈ ఏడాది సెప్టెంబరులో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడ్డాడు.అతనికి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌ఖైదీగా ఉన్నాడు. కొద్దిరోజులుగా మూర్ఛ, శ్వాససంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. మంగళవారం అతడికి వాంతి కావడంతో జైలు ఆస్పత్రిలో చికిత్స అందించారు. రాత్రికి పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి జైలు సిబ్బంది తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లావారుజామున ప్రమాదవశాత్తూ పంటకాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో పోతవరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌తోపాటు భార్య ఉమ, కుమారులు రోహిత్, మనోజ్ ప్రయాణిస్తున్నారు. ఈప్రమాదంలో విజయ్‌కుమార్ బయటపడగా భార్య ఉమ(32), కుమారులు రోహిత్(9) మృతిచెందారు.మరో కుమారుడు మనోజ్(5) గల్లంతు కాగా.. అతడి మృతదేహం సంఘటనాస్థలికి కూతవేటుదూరంలో బుధవారం లభ్యమైంది. విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా సీఐ భీమరాజు దర్యాప్తు చేపట్టారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



ఊర్వశి	– రాజమండ్రి
సూర్య ప్యాలెస్	– రాజమండ్రి
ఆనంద్ సినిమాస్	– కాకినాడ
దేవి సినిమాస్	– కాకినాడ
శేఖర్ స్క్రీన్	– అమలాపురం
మిని సప్తగిరి	– మండపేట
సత్య	– పిఠాపురం
వీరభద్ర	– పెద్దాపురం
శ్రీనివాస	– తాటిపాక
జయశ్రీ	– యల్లేశ్వరం
వెంకటేశ్వర	– రావులపాలెం
నాగేశ్వర	– జగ్గంపేట
వెంకటనారాయణ	– ముమ్మిడివరం
సత్య చంద్ర	– కొత్తపేట

వచ్చే నెల 1 తర్వాతే ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులు, వారి కుటుంబ పింఛనుదారులు ప్రతీ ఏడాది అందిస్తున్న తమ లైఫ్ సర్టిఫికెట్ వచ్చేనెల 1న తర్వాతే అందించాలని జిల్లా ఖజానా అధికారి ఎస్. సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు పెన్షనుదారులు అవగాహన లేక ముందుగా లైఫ్ సర్టిఫికెట్ అందిస్తున్నారని అటువంటి వారికి చెబుతున్నామన్నారు. జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసిన వాటినే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. డిసెంబరు 31లోగా అందించవద్దని విజ్ఞప్తి చేశారు. జనవరి 1 తర్వాత లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన్ ప్రమాణ్ లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించాలన్నారు. వ్యయ ప్రయాసల కోర్చి ట్రెజరీకి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయాలను పింఛనుదారులు గమనించాలని ఆయన కోరారు.



భగవద్గీత పోటీల విజేతలతో సత్యగోపీనాథ్ ప్రభూజీ

ఇస్కాన్‌లో గీతా జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా బుధవారం గోదావరి గట్టున గల ఇస్కాన్ మందిరంలో గీతా జయంతి వేడుకలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి సామూహిక గీతా పారాయణం, 18 అధ్యాయాలు, 700 శ్లోకాల పఠనం జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు గీతాయజ్ఞం జరిపారు. అనంతరం సత్యగోపీనాథ్ ప్రభూజీ చేతుల మీదుగా విద్యార్థులకు వెయ్యికి పైగా ఉచిత భగవద్గీతలను పంచిపెట్టారు. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

26న పీఎంపీ వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ది రెడ్డీస్ ఫంక్షన్ హాలులో 26న పీఎంపీ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు బుధవారం తెలిపారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ అధ్వర్యంలో హుకుంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పీఎంపీ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్ళ శ్రీనివాస్, పి. దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్ తదితర పీఎంపీలు పాల్గొన్నారు.



ఎస్‌కేవీటీ కళాశాలలో ప్రిన్సిపల్ భగవతికి సత్కారం

ఘనంగా సంఘ సంస్కరణ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి ఆధ్వర్యంలో సంఘ సంస్కరణ దినోత్సవాన్ని జరిపారు. గౌరవ అతిథి ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ కల్యాణి భగవతి మాట్లాడుతూ కందుకూరి అంటేనే ఒక బ్రాండ్ అని.. ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరూ అదృష్టవంతులన్నారు. నన్నయ వర్సిటీ ఆచార్య తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించడంలో కందుకూరి చేసిన కృషి నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పీవీబీ సంజీవరావు, ఎంఎస్.ఫణికుమార్, జి.కోటమ్మ, కె.విశ్వేశ్వరరావు, ఎస్.రాజ్‌కుమార్, విశ్వనాథం, సోనీ తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

బిక్కవోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం ఆయా ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బిక్కవోలు తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. మండలంలో బిక్కవోలు, పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు, బలభద్రపురం గ్రామాల్లోని నీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పోలింగ్ జరుపుతామన్నారు. కొమరిపాలెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా తాను నోటిఫికేషన్ విడుదల చేశానని తెలిపారు. ఈనెల 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

నీటి సంఘాల ఎన్నికపై సమీక్షా సమావేశం

రంగంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల వ్యవస్థలోని ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు నీటి వినియోగదారులు సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షుల పదవులకు ఎంపిక ఎన్నికల ప్రకటన బుధవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిబాబు విడుదల చేశారు. అసాధారణ సర్వసభ్య మండలి సమావేశం ఈనెల 14న రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని ఆయన తెలిపారు. సర్వసభ్య సమావేశం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఏకాభిప్రాయం లేనిచోట ఓటర్ల ఎంపికను చేతులెత్తే విధానం ద్వారా లేదా ఓటింగ్ స్లిప్పులు ద్వారా జరుతుందన్నారు. మండలంలో రంగంపేట, దొడ్డిగుంట నీటి సంఘాల ఎన్నికల నిమిత్తం మండలం పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కోను అనసూయ, ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం, మండలంలో గల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కృష్ణప్రసాద్ సేవలు ఆదర్శప్రాయం

● పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

కోరుకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా 44 సంవత్సరాలపాటు అంకితభావంతో పనిచేసిన కోర్పు కృష్ణప్రసాద్ సేవలు ప్రతి ఉద్యోగికి ఆదర్శప్రాయమని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు పేర్కొన్నారు. కోరుకొండ హెడ్ పోస్టాఫీసు కార్యాలయం ఆవరణలో బుధవారం రాత్రి కోర్పు కృష్ణ ప్రసాద్ పదవీవిరమణ అభినందన సత్కార సభ జరిగింది. రాజమహేంద్రవరం డివిజన్ ఏఎస్పీ శ్యామసుందరం, కోరుకొండ హెడ్‌పోస్టుమాస్టర్ బాబురావుదొర, రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ ఉన్నత ఉద్యోగులు, కోరుకొండ మండలం బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, సిబ్బంది కృష్ణప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రుడా ఛైర్మన్ బొడ్డువెంకట రమణ చౌదరి, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిన రోజ వీరగణేష్, నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ యువ నాయకుడు పెందుర్తి అభిరాం, పలువురు ప్రజాప్రతినిధులు, నర్సాపురం మాజీ సర్పంచ్ నొక్కి అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.



కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు

గీతా శ్లోక పఠనం భావితరాలకు అందించాలి

రంగంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతశ్లోక పఠనం భావితరాలకు బాల్యం నుంచి అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని శ్రీచైతన్య కళాశాల సంస్కృత అధ్యాపకులు కందర్ప భాస్కరరామలింగేశ్వరమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం గీతా జయంతి సందర్భంగా రంగంపేట మండలం కోటపాడు శ్రీసత్యసియా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణ ఆలయం వద్ద నిర్వహించిన 108 భక్తుల సామూహిక గీతాపారాయణ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవ సమితి కన్వీనర్ కందర్ప వెంకటఅమర్నాథ్, సింగన సత్యనారాయణ, నర్లశ్రీనివాస్, పోతుల ఈశ్వరరావు, శిరిగిన వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం చిన్నదొడ్డిగుంట గ్రామానికి చెందిన యాగా రాంబాబు అనే వ్యక్తి జీవితం మీద విరక్తితో మంగళవారం రాత్రి పొలంలో కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని తాగాడు. తన భార్యతో బంధువుల సహాయంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేయగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున 3.24 నిమిషాలకు మరణించినట్లు రంగంపేట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కోన నాగేశ్వరరావు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీ కార్యాలయ నిర్మాణంపై ఉన్న శ్రద్ధ

మెడికల్ కాలేజీపై లేదు!

● కాలేజీ పూర్తి కావడానికి ఇంకా ఏడాది పడుతుంది ● కళాశాల పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యాలయం నిర్మించుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రభుత్వ మెడికల్ కళాశాల పూర్తి చేయడంలో గత పాలకులు చూపలేకపోయారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ భవనాలను ఆయన కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి సొమ్ముతో అడ్డగోలుగా వైసీపీ కార్యాలయాన్ని మూడు నెలల్లో పూర్తి చేసిన ఆ పార్టీ నాయకులు ప్రజలకు ఉపయోపడే మెడికల్ కాలేజీ భవనాలను పూర్తిచేయడంలో ఆసక్తి కనబరచలేదన్నారు. దీంతో మెడికల్ విద్యార్థులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వచ్చి చూసి నిధులు విడుదల చేశారని చెప్పారు. మెడికల్ కాలేజీ పూర్తికావడానికి ఏడాది పడుతుందని విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించి వేరొకచోట పెట్టాలని లేకపోతే ఇక్కడ ఉన్నవారే మారతారని హెచ్చరించారు. ఆయన వెంట కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, యాళ్ళ ప్రదీప్, అబ్దుల్లా, మరుకుర్తి రవియాదవ్, రాయి అప్పన్న బాబు, కేబుల మురళి, కవులూరి వెంకటరావు, అజ్జరపు రమేష్, కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, గుత్తుల సత్యనారాయణ, తుళ్ళి పద్మ, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల భవనం వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

2027లో రోలర్ హాకీలో మెడల్ సాధించడమే లక్ష్యం



మెడల్స్ సాధించిన కేశవ్‌తో తల్లిదండ్రులు రమేష్, దేవి

ఉండ్రాజవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీలో 2027లో నిర్వహించే ఏషియన్ ఛాంపియన్‌షిప్ రోలర్ హాకీలో మెడల్ సాధించడమే లక్ష్యమని చివటం గ్రామానికి చెందిన మునుపర్తి నాగసాయికేశవ్ బుధవారం తెలిపారు. డిసెంబరు 5వ తేదీ నుంచి జరిగిన అండర్-14 సబ్‌జూనియర్ విభాగంలో నేషనల్ రోలర్ స్కేటింగ్ హాకీకి జాతీయస్థాయి పోటీల్లో ఏపీ టీమ్ గోల్ కీపర్‌గా రాష్ట్రస్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. తణుకులో ఏడో తరగతి చదువుతున్న కేశవ్ రెండేళ్లుగా కోచ్ భార్గవ్ వద్ద శిక్షణ పొందుతున్నానన్నారు. తన కుమారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మంచి పేరు తీసుకురావాలని తల్లిదండ్రులు రమేష్, దేవి ఆకాంక్షించారు.

డీఏపీ కొరతతో రైతు అగచాట్లు



వేళ్లచింతలగూడెంలోని డీసీఎంఎస్ గోదాము

గోపాలపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు డీఏపీ అందని ద్రాక్షగా మారింది. ప్రతిఏటా ఈ సీజన్‌లో పొగాకు సాగు చేసే రైతులు ఇతర ఎరువులతో పాటు డీఏపీని ఉపయోగిస్తారు. ఈ ఏడాది తుఫాన్ల ప్రభావంతో పొగాకు నాట్లు ఆలస్యంగా జరిగాయి. మండలంలో వేలచింతలగూడెం, రాజంపాలెం గ్రామాల్లో డీసీఎంఎస్ గోదాము గోపాలపురం, జగన్నాధపురం, కొవ్వూరుపాడు, హుకుంపేట, రాజం పాలెం, భీమోలు తదితర గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ డీఏపీ మాత్రం అందుబాటులో లేదు. దీంతో రైతులు అవి దొరక్కపోవడంతో ఎరువులు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో డీఏపీకి 1150 నుంచి 1650 వరకు ధర పెరిగిందని దీంతో కంపెనీలు సరఫరా చేసే డీఏపీ తెలంగాణ రాష్ట్రానికి తరలి పోతోందని పొగాకు రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డీఏపీని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో 3915 మంది రైతులకు సంబంధించి 19,401,45 ఎకరాల్లో పొగాకు సాగవుతోంది. ఈ ఏడాది ఎకరానికి 2 బస్తాల డీఏపీ చొప్పున 38,802.9 బస్తాల వరకు ఈ ఏడాది అవసరమవుతుంది. దీనిబట్టి చూస్తే మండలంలో డీఏపీ కొరత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

ఇసుక లారీలు పంగిడి మీదుగా వెళ్లాలి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి చాగల్లు పరిసర ప్రాంతాలకు ఇసుక రవాణా చేసే లారీలు పంగిడి మీదుగా రాకపోకలు సాగించాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదులు, భయాందోళన నేపథ్యంలో ర్యాంపుల్లోని ఏజెన్సీలను హెచ్చరించినట్టు తహశీల్దార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు 9 మందిపై కేసులు నమోదు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు సారధ్యంలో రాజమహేంద్రవరంలో డ్రంగ్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో 9 మంది మద్యం తాగి వాహనాలు డ్రైవ్ చేయడాన్ని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. వారిని ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారికి న్యాయమూర్తి ఎం.జగదీశ్వరి శిక్ష విధించారు. వారిలో ఎనిమిది మందికి రూ.10 వేల చొప్పున, ఒక్కొక్కరికి రూ.5వేలు ఫైన్ విధించారు.

బాలికకు వివాహం.. కేసు నమోదు

రాజమహేంద్రవరం, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ షాదీఖానాలో బాల్య వివాహం ఘటనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండ లం కోలమూరు గ్రామానికి చెందిన 14 ఏళ్ళ బాలికను కర్నాటకకు చెందిన 21 ఏళ్ళ అహ్మద్ కైఫ్‌తో షాదీఖానాలో షేక్ కరిముల్లా వివాహం చేశాడని వచ్చిన ఫిర్యాదుమేరకు అహ్మద్ కైఫ్, అతని తండ్రి, వివాహం చేసిన కరీముల్లాపైనా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మండలంలోని 16 గ్రామాలను 3 బ్యాచ్‌లుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌కు రెండు రోజుల శిక్షణ అందిస్తామన్నారు. గురు, శుక్రవారాల్లో చిడిపి, కుమారదేవం, ఆరికిరేవుల, పెనకనమెట్ట, ధర్మవరం గ్రామాలు, 17, 18 తేదీల్లో దొమ్మేరు, కాపవరం, పంగిడి, నందమూరు, పశివేదల గ్రామాలు, 19, 20 తేదీల్లో వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, సీతంపేట, మద్దూరులంక గ్రామాలకు సంబంధించి కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ అందిస్తామన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రేడ్ (1-5) పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు.

వైభవంగా గౌరీశంకరుల రథోత్సవం

● పాల్గొన్న ప్రముఖ నాయకులు

కోరుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గౌరీశంకర్ల రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ గౌరీశంకర్ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులందరూ వివిధ రకాల కళారూపాలతో గౌరీశంకర్ల రథం ముందు నడిచారు.

శ్రీరంగపట్నం ఆలయాలకు రూ. లక్ష విరాళం

కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలోని శివాలయానికి, ఓం శాంతి ఆశ్రమానికి చెరో రూ.50వేలు వంతున లక్ష రూపాయల విరాళాన్ని రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అందజేశారు. శ్రీరంగపట్నంలో బుధవారం జరిగిన గౌరీశంకర్ల రథోత్సవంలో కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలోని నిరుపేద మహిళలకు ఉచితంగా బియ్యం బస్తాలు పంపిణీ చేశారు.శ్రీరంగపట్నంలో 7 ఆలయాలకు సంబంధించి రూ.8లక్షలు విరాళంగా అందజేశామని కంబాలశ్రీనివాసరావు ప్రకటించారు. ఏ ఆధారం లేని నిరుపేద మహిళలకు ప్రతినెలా ఉచితంగా బియ్యాన్ని అందజేస్తామన్నారు. ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని అలాంటి వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారికి కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ మద్దాల రమణ, మాజీ జడ్పీటీసీ అప్పలనర్సారావు, మాజీ ఎంపీపీ బుద్దాబాపూజీ, మామిడి అయ్యప్ప, వినగోటి బాపన్నదొర, సా మర్ల రాంబాబు, వరసాల ప్రసాదు, డాక్టర్ వల్లూరి జగన్నాధరావు, శర్మ, కట్టాకల్యాణ్ పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు



శ్రీరంగపట్నం ఆలయాలకు లక్ష రూపాయల విరాళం ఇస్తున్న కంబాల శ్రీనివాసరావు

ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ

బిక్కవోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఊలపల్లి గ్రామానికి చెందిన ముక్కామల సూరమ్మ కాశీ యాత్రకు వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేసినట్లు బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సూరమ్మ భర్త కొంతకాలం క్రితం చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటుంది. ఈయేడాది అక్టోబరు 10న ఆమె గ్రామంలోని కొంతమందితో కలసి కాశీ యాత్రకు వెళ్లింది. వెళ్తూ ఇంటికి తాళంవేసి తాళాన్ని ఇంటి ప్రక్కన వున్న మేనకోడళ్లకు ఇచ్చి వెళ్లింది. ఆమె తిరిగి బుధవారం ఉదయం 6.30కు ఇంటికి వచ్చి తాళంతీసి చూడగా బీరువా తెరచి ఉందని, మంచంపై బీరువాలో వుండవలసిన వెండి వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉండడంతో బీరువాను పరిశీలించగా అందులో ఉన్న 2కాసుల బంగారు తాడు, అరకాసు లవ్‌సింబల్ ఉంగరం, అరకాసు బుట్ట మీద బుట్ట కలిగిన చెవిటీలు కనబడకపోవడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణం

కోరుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కళావేదిక వద్ద 225 మంది దంపతులచే స్వామివారి శాంతి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, విశ్వనాధశర్మల ఆధ్వర్యంలో ఈ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉల్లి వీరభద్ర వెంకట సత్యప్రసాద్ (బుచ్చిబాబు), వైస్ ప్రెసిడెంట్ బదిరెడ్డి సత్యనారాయణమూర్తి, సెక్రటరీ ఒంటిపల్లి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కోశాధికారి కటకం సత్యనారాయణ, కటకం చలం, నీరుకొండ బాబ్జి, కోలా వీరేష్‌కుమార్, ఉల్లికాశీ విశ్వనాథ్, కేతినీటి అశోక్‌కుమార్, ఎం. శ్రీను, లక్ష్మి రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గోకవరం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 12వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎం.వి.సాయిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ 12న కృష్ణునిపాలెం, 13న తిరుమలాయపాలెం, 17న గంగంపాలెం, 18న గోకవరం, 19న మల్లవరం, 20న కొత్తపల్లి, కామరాజుపేట-1, 21న భూపతిపాలెం, 24న కలిజోళ్ళు, 26 సూదికొండ, 27న శివరామపట్నం, 28న అచ్చుతాపురం, 2న ఠాకూరుపాలెం, 3న తంటికొండ 4న రంపయర్రంపాలెం, 7న గుమ్మళ్ళదొడ్డి, వెదురుపాక, 8న గాదెలపాలెం, ఇటికాయిపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సుస్మిత ఎంపిక

బిక్కవోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వైరాల సుస్మిత ఎంపికైందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఈమె ఈనెల 13 నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ఆడనుందన్నారు. ఎంపికైన సుస్మితను, ఈమెను తీర్చిదిద్దిన పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోనాల సత్తిరాజు, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి అభినందించారు.



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సుస్మితను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరెడ్డి

నాగమణికి వీరేశలింగం పంతులు పురస్కారం అందజేత

గోకవరం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల నిర్వహణతో పాటు, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజామన్ననలు అందుకుంటున్న మండలం లోని కొత్తపల్లి ఆదర్శ విద్యాసంస్థల సెక్రటరీ ప్రగళ్ళపాటి నాగమణిని శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు పురష్కారం వరించింది. రాజమహేంద్ర వరంలోని వైఎంవీఏ భవనంలో నల్లమిల్లి రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, టీడీపీ నాయకులు గన్నికృష్ణ, తదితరుల నుంచి ఆమె ఈ పురష్కారాన్ని అందుకున్నారు. రానున్న రోజుల్లో మరన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలంటూ వారు నాగమణిని అభినందించారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



రంభ	- రాజమండ్రి
దేవి కాంప్లెక్స్	- కాకినాడ
సినీఆర్ ఐనాక్స్ (SRMT)	- కాకినాడ
విజయ మహల్	- మండపేట
శేఖర్	- అమలాపురం
రాజవేణి	- జగ్గంపేట
రాజగోపాల్	- రామచంద్రపురం
వెంకటేశ్వర	- ఊడిపాక
శోభా	- పెద్దాపురం
టీరేశ్వర	- యానం
జయలక్ష్మి	- సామర్లకోట
సూర్య సినిమాస్	- వాకలపూడి

CONTACT: 9849538226



చెన్నయ్.. చంద్రమూ!

హాయ్.. హాలో.. నమస్తే.. బాగున్నారా! అంటూ సినీనటి శ్రీలీల రాజమహేంద్రవరంలో సందడి చేశారు.. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రారంభించి కాసేపు అభిమానులతో ముచ్చటించారు. శ్రీ లీల వస్తుందని తెలియడంతో పెద్ద ఎత్తున అభిమానులు షోరూమ్ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీ లీల అభిమానుల ముందుకు వచ్చి కాసేపు అలరించారు. రాజమహేంద్రవరం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు.. చెన్నయ్ చీరలంటే నాకు చాలా ఇష్టమని.. ఈసారి చీరలు కావాలంటే రాజమహేంద్రవరం వచ్చేస్తానని చెప్పడంతో అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు.. ఈలలు.. కేకలతో సందడి చేశారు.. దీంతో శ్రీ లీల ఐ లవ్ రాజమహేంద్రవరం అంటూ లవ్ సింబల్‌తో ఇలా ఫోజిచ్చారు..

8

జల్సా చేసేందుకు బైక్‌ల చోరీలు!



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ



సీఎం సదస్సులో కలెక్టర్ ప్రశాంతి

గోదావరి జిల్లాలు వెనకబడ్డాయి!

- ప్రత్యామ్నాయ విధానంలో ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచాలి
- కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గోదావరి జిల్లాలపై సీఎం నారా చంద్రబాబు ఆసక్తికరమైన ,విలువైన వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో బుధవారం మొదలైన కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించి గ్రాస్ వేల్యూ యాడెడ్ (జీవీఏ) తగ్గిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జిల్లాలంటే పుష్కలంగా నీటితోనూ, సారవంతమైన భూముల తోనూ ఉంటాయని, రాయలసీమ కంటే బాగా ఉత్పత్తి సాధించే వన్నారు. ప్రస్తుతం రాయలసీమలో జీవీఏ పెరిగిందని.. గోదావరి జిల్లాల్లో తగ్గిపోయిందన్నారు.తూర్పుగోదావరి జిల్లా 10వ స్థానంలో ఉండగా, కాకినాడ,కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో బాగా తగ్గినట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్లు బాగా దృష్టి పెట్టి ఏ పరిస్థితుల వల్ల జీవీఏ తగ్గిందో ఆరా తీసి అవసరమైతే సాగులో ప్రత్యామ్నాయం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంట ఉండేటట్టు ప్రయత్నం చేయాలన్నారు. వ్యవసా యంతో పాటు ఆక్వా కల్చర్ కూడా బాగా పెంచాలని తెలిపారు.ముఖ్యంగా కాల్వలు సరిగా లేకపోవడం, కాలుష్యం పెరిగిపోవడం వంటి సమస్యల వల్ల కూడా పంటల ఉత్పత్తిపై ప్రభావం పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లా డుతూ జిల్లాలో 450 ఎకరాల రైతులు ఆక్వాకు మారతామని దరఖాస్తు చేశారన్నారు.వ్యవసాయ ఉత్పత్తి తగ్గిందని చెబుతున్నారని ఆమె తెలిపారు. ఇటువంటి భూములపై ముందు పీహెచ్ పరీక్షలు చేయాలని , సిబ్బంది కొరత ఉందని, అందువల్ల రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో పిహెచ్ పరీక్షలు చేయించే ఆలోచన చేస్తున్నట్టు ఆమె వివరించారు.

నేడు నిడదవోలు రైల్వే గేటు మూసివేత

నిడదవోలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని రైల్వే గేటు 11వ తేదీ బుధవారం రాత్రి 10 గంటల నుంచి 12వ తేదీ రాత్రి 10 గంటల వరకు రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. నిడదవోలు, తాడేపల్లిగూడెం వైపు రాకపోకలు సాగించే వాహనదారులు నిడదవోలు మీదుగా సుబ్బరాజుపేట,శింగవరం, తాళ్ళపాలెం మీదుగా రాకపోకలు సాగించవచ్చునన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం రెండు వైపులా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

అసర్ సర్వేపై శిక్షణ

నల్లజర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జరుగుతున్న అసర్ సర్వే విజయవంతం చేయాలని జిల్లా కోఆర్డినేటర్ డి.సోమసుందర్ అన్నారు.నల్లజర్ల మండలం దూబచర్ల డైట్ కళాశాలలో బుధవారం- 2024 సంవత్సరానికి సంబంధించి అసర్ సర్వే నిమిత్తం వలం టీర్లకు శిక్షణ ప్రారంభించారు. 3 నుంచి 16 ఏళ్ల వయసు గల పిల్లల వాస్తవ విద్యా స్థితిగతులను పరీక్షించడానికి సర్వే చేపడుతున్నామన్నారు.దేశ వ్యాప్తంగా 30 వేల మంది వలంటీర్లు సర్వేలో పాల్గొంటారన్నారు. జిల్లాకు 30 గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని నిమిత్తం 60 మంది ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనీలు జి.సురేష్ బాబు,డి.రాజేష్ మూడు రోజుల పాటు సర్వేపై శిక్షణ ఇస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల కుమారి, అధ్యాపకులు రమణమూర్తి,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు



టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోండి

టీబి రాష్ట్ర జేడీ డాక్టర్ రమేష్

కొవ్వూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిగ్రస్తులను ఆరు నెలల పాటు దత్తత తీసుకుని న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్లను అందజేయాలని టీబీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ సూచించారు. దొమ్మేరు పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అండ్ వెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వాడుతున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తాభియాన్ కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలన్నారు. ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు సూచనలు అందజేశారు. అనంతరం సర్పంచ్ తానేటి కుమారి సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసుంధర, వైద్యాధికారులు ఎస్.ధర్మరాజు, సీనియర్ ట్రీట్‌మెంటు సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి,శ్రీనివాస్, పోతురాజు, వీర్రాజు, భీమరాజు,సమీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జనవరి 8 వరకు

రెవెన్యూ సదస్సులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల వారీ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది.భూ సమస్యలు, గత ప్రభుత్వం సర్వే సమయంలో చేసిన అవ కతవకలు తదితర అంశాలపై ఇప్పటికే ఆయా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన సంగతి తెలిసిందే.ఆయా సమస్యలు పరిష్కరించనున్నారు.జిల్లాలోగురువారం నుంచి జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సభలు నిర్వహించనున్నారు.ఆ యా మండలాల్లో రోజుకొకటి నుంచి మూడు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారు.

దానవాయిపేట గాంధీ పార్కు



ఆహ్లాదమేదీ!

అధ్వానంగా పార్కుల నిర్వహణ

- జిల్లావ్యాప్తంగా 50 పార్కులు
- రాజమహేంద్రవరంలోనే 30
- కోట్లు ఖర్చుపెట్టారు..వదిలేశారు
- పాడైపోతున్న వస్తువులు
- కన్నెత్తి చూడని పాలకులు
- పట్టించుకోని అధికారులు
- సందర్శకుల అసహనం
- ప్రారంభంకాని చిల్డ్రన్స్ పార్కు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అలక్ష్యం వెరసి ఆహ్లాదం అటకెక్కిపోతోంది.. కోట్లాది రూపాయలు పెట్టి అందంగా తీర్చిదిద్దిన పార్కులు నేడు నిర్వహణ లేక పాడైపోతున్నాయి. అయినా అటు అధికారులు .. ఇటు పాలకులు వాటి ఊసే మర్చిపోయారు.. పర్యాటక శాఖ మంత్రి జిల్లాలోనే ఉన్నా వీటి నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో రాజమహేంద్రవరంలో ఆహ్లాదాన్ని పంచడానికి అందంగా తీర్చిదిద్దిన ఉద్యాన వనాలు రోజురోజుకు అధ్వానంగా మారిపోతున్నాయి.

అటకెక్కిన ఆహ్లాదం

జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి తదితర ప్రాంతాల్లో 50 వరకూ చిన్నా పెద్దా పార్కులు ఉంటాయి. ఉదయం,సాయంత్రం వేళల్లో పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అన్ని వయసుల వారు కొద్దిసేపు సేదతీరతారు.ఈ నేపథ్యంలో కోట్లు ఖర్చు పెద్ద ఎత్తున పార్కుల ఆధునీకరణ చేశారు. గత ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల అవి ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోయాయి. పార్కులైతే ఉన్నాయి కాని వాటిని వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది.దానవాయిపేటగాంధీ పార్కును ఆధునీకరణ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు.కానీ ఉపయోగంలేదు.గతంలో కంబాల చెరువు పార్కు ప్రవేశం ఉచితం..ప్రతి రోజూ వంద లాది మంది పార్కులో వాకింగ్ చేసేవారు..సరదాగా గడిపేవారు. ప్రస్తుతం ఆ పార్కులోకి వెళ్లాలంటే పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20 ఉంది. దీంతో ఎవరూ వెళ్లేందుకు ఆసక్తి చూపిం చడంలేదు. గ్లో పార్కు పరిస్థితి ఇలాగే ఉంది.గ్లో పార్కు లో చాలా లైట్లు వెలగడంలేదు. అయినా పట్టించుకునే వారేలేరు.దానవాయిపేట గాంధీ పార్కుదీ ఇదే పరిస్థితి. పార్కులో లక్షలు ఖర్చు పెట్టిన గ్రీన్ గ్రాస్.. గడ్డి మాదిరిగా ఎదిగిపోయి అందవిహీనంగా తయారైంది. ఏకేసీ కాలేజీ రోడ్డులో ఉన్న పార్కుల పరిస్థితి అలాగే ఉంది.గోదావరి బండ్ రోడ్డులో పీవీ.నరసింహారావు పార్కులో కూడా ఆటపరికరాలు దెబ్బతిన్నాయి. కొవ్వూరు గోదావరి బండ్‌పై పార్కు చిట్టడవిలా ఉంది.



దానవాయిపేట పార్కులో గడ్డిలా పెరిగిన గ్రాస్

పార్కుల నిర్వహణ ప్రైవేటుకు వద్దు..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 30 పార్కులు ఉన్నాయి. వాటిలో ప్రజలు సేద తీరడానికి ఉపయోగపడేవి కేవలం 10లోపే పార్కులు ఉం టాయి. వాటిని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు.. ఉచిత ప్రవేశ ఎత్తివేయడంతో ప్రజలు సేదతీరేందుకు ఉద్యానవనాలతో ఉన్న పార్కులు దోహదపడడం లేదు. పైగా పార్కుల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే ఆలోచన అధికార యంత్రాంగంలో ఉన్నట్టు సమాచారం. ఈ విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మునిసిపల్ పార్కుల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదనే వాదన వినిపిస్తోంది.

పిల్లలకు ప్రవేశం లేదు.. వాహనాలకేనట!

ఇది పార్కా..వాహనాల పార్కింగా ప్లేసా అనుకుంటున్నారా.. ఇది పార్కేనండి బాబూ.. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మరీ తయారు చేయించారు. అధికారులకు ఖాళీ లేదో.. పాలకులకు ఖాళీ లేదో తెలి యదు కానీ ఇంకా ప్రారంభం కాలేదనుకోండి.. స్థానికులు మాత్రం ఎందుకు ఖాళీగా వదిలేయడమో ఏమో అనుకున్నారేమో ఇలా వాహనాల పార్కింగ్ ప్లేస్‌గా మార్చేశారు. ఇదెక్కడో మారుమూల కాదండోయ్.. రాజమహేంద్రవరం జాతీయ రహదారిని అనుకుని లాలాచెరువు వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోట్లు ఖర్చు చేసి నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కు పరిస్థితి ఇది. పార్కును అద్భుతంగా నిర్మించి చాలా కాలంగా మూసివేశారు. ఈ పార్కులోకి పిల్లలు వెళ్లడానికి వీలులేదు కానీ భారీ వాహనాలు పెట్టుకోవడానికి మాత్రం ఇలా తాళాలు తెరుచుకోవడం గమనార్హం.



చిల్డ్రన్స్ పార్కులో ఉన్న వాహనాలు





సెంట్రల్ జైలులో ఆర్‌డీవో విచారణ

ఖైదీ సుభాన్ ఒంటిపై దెబ్బలు లేవు..

బీడీ కాలుస్తుంటే మందలించారని వెల్లడి

రాజమహేంద్రవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ సుభాన్‌ను డీఐజీ కొట్టి గాయపరిచారనే సంఘటనపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన బుధవారం సెంట్రల్ జైలులో బాధితుడు సుభాన్, అక్కడ ఖైదీలు,డీఐజీ, సూపరింటెండెంట్‌ను విచారించారు. కానీ సుభాన్ శరీరం మీద ఎక్కడా దెబ్బలు కనిపించలేదని.. తనను కొట్టారని కూడా సుభాన్ చెప్పలేదని ఆర్డీవో తెలిపారు.డీఐజీ బంగ్లా వద్ద కాల్చిపడేసిన బీడీని తిరిగి తాను కాల్చినపుడు డీఐజీ మందలించి సూపరింటెండెంట్‌కు అప్పగించారని తెలిపాడన్నారు. సుభాన్‌ను అధికారులు భయపెట్టినట్టు సమాచారం. తనను ఎవరూ కొట్టలేదని, తానే బీడీ తాగడంతో అధికారులు తిరిగి సెంట్రల్ జైలు బ్యారక్‌లోకి పంపేశారని రాతపూర్వకంగా అతని చేత రాయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

నాపై తప్పుడు ప్రచారం

డీఐజీ రవికిరణ్

తాను విధుల్లో కఠినంగా ఉండడం వల్లే తన కింద సిబ్బంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీఐజీ రవికిరణ్ తెలిపారు. వార్డర్లు, ఇతరులకు రెండు షిఫ్ట్‌ల డ్యూటీ వేశానని..విశాఖలో పలువురిని సస్పెండ్ చేయించడంతో పాటు కొందరికి చార్జిమెమోలు ఇచ్చానని అందుకే తనపై కక్షకట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సుభాన్ అనే ఓపెన్ జైలు ఖైదీ బీడీ తాగుతున్నా డని ఎవరో వచ్చి తనకు చెబితే తాను మరో వార్డర్‌కు చెప్పి సూపరింటెండెంట్ వద్దకు పంపానన్నారు.తన బంగ్లాలో అతనేమీ పనిచేయడంలేదని.. తానేమీ కొట్టలేదన్నారు. నెల్లూరులో కూడా తప్పుడు ప్రచారం చేశారని..చివరకు సీఐడీ విచారణలో అంతా తప్పని తేలిందన్నారు.

అధికారుల ఇళ్లల్లో పనిచేయరు

సూపరింటెండెంట్ రాహుల్

అధికారుల ఇళ్లలో ఖైదీలెవరూ పనిచేయరని.. ఓపెన్ జైలు ఖైదీలతో కారాగార భూములు,భవనాలు, అధికారులు ఉంటున్న క్వార్టర్స్ వద్ద పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించడం వంటి పనులు చేస్తారని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కె.రాహుల్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సుభాన్ బీడీ కాల్చడం వల్ల అతన్ని తిరిగి బ్యారక్‌లోకి పంపించామన్నారు.ఎవరూ కొట్టలేదని గాయాలు కూడా లేవన్నారు.

పెళ్లయిన ఏడాదికే..వివాహిత ఆత్మహత్య 8



వాడాలకుంటలో కుళ్లిన పొగాకు నారు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

ఎదుగుదల లేని పొగాకు

వాతావరణమే కారణమన్న శాస్త్రవేత్త

గోపాలపురం,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు అధికారులను సంప్రదించి తగు సూచనలు తీసుకుని సాగు చేయాలని సీటీఆర్ఐ శాస్త్రవేత్త హెచ్ఎస్.మహేష్ అన్నారు. మండలంలోని వాదాలకుంట తదితర గ్రామాల్లో పొగాకు తోటలను బుధవారం పరిశీలించి మాట్లాడారు.వాతావరణంలో మార్పులతో మొక్కల ఎదుగుదల లోపించిం దన్నారు. సహజంగా వర్జీనియా పొగాకు తోటలకు ఎండతో కూడిన వాతావరణం అనుకూలమైందన్నారు.వాతావరణ మా ర్పులతో ఎదుగుదల లేక పోవడంతో వాదాలకుంట గ్రామానికి చెందిన ఉండ వల్లి రాజు అనే రైతు 27 ఎకరాల పొగాకు తోటను దున్నివేశారన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు మొక్కలకు సోకిన తెగుళ్లను నియంత్రించడానికి రేడా మిల్ గోల్డ్ ఎకరానికి అర కేజీ పిచికారీ చేసి తెగుళ్ల విస్తరించ కుండానియంత్రించవచ్చన్నారు.ఆయన వెంట శ్యామ్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ కేఆర్.మీనా, ఫీల్డ్ ఆఫీసర్ కీర్తికుమార్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

విలేకరులు కావలెను

1. కాకినాడ (స్టాఫ్ రిపోర్టర్)

మండలాల రిపోర్టర్ల ఖాళీలు :

1. అమలాపురం అర్బన్ 2. రామచంద్రపురం
3. మండపేట రూరల్ 4.కాజులూరు 5. పెదపూడి
6.కాకినాడ జగన్నాథపురం 7. కాకినాడ మసీదు సెంటర్
8.మధురపూడి 9. రాజమహేంద్రవరం కలెక్టరేట్
10. బొమ్మూరు

ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.

అభ్యర్థులు ఇంటర్ / డిగ్రీ చదివి వుండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి. పైన పేర్కొన్న అర్హతలున్న అభ్యర్థులు

తేది 13-12-2024 (శుక్రవారం)

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను

అడ్రస్: ఆంధ్రజ్యోతి కార్యాలయం

దివాన్‌చెర్వు, వెలుగుబంద రోడ్, పాలచర్ల పంచాయతీ

ఫోన్ : 99854 11242

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 1

పాఠకుని పూర్తి పేరు : ....
డోర్ నెంబరు : ....
వీధి పేరు : ....
గ్రామం / పట్టణం : ....
మండలం : ....
జిల్లా : ....
పోస్టల్ పిన్‌కోడ్ : ....
ఫోన్ నంబర్ : ....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, డో.నెం.114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్డు, పాలచర్ల (గ్రామం), రాజానగరం మండలం, రాజమహేంద్రవరం పిన్-533 102.

బ్రాంచ్ మేనేజర్ : 9985411241, సర్క్యులేషన్ మేనేజర్ : 9985411247

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పోతవరం-యర్నగూడెం రోడ్డుకు నిధులు మంజూరు

నల్లజర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోతవరం-యర్నగూడెం రోడ్డు త్వరగా వేయాలని అర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఆదేశించారు. బుధవారం పోతవరంలో గుంతల రోడ్డును పరిశీలించిన ఆయన రోడ్డు నిర్మాణానికి మొదటి దపాగా 20లక్షల92వేల272 నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ(జెడి), మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, గుండా వీరకృష్ణ, బేతిన అనిల్ పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

లక్ష్మీ నారాయణస్వామికి పూజలు



నిడదవోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలోనున్న లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి విశేష పూజలు జరిపారు. ఉదయం నుంచి విష్ణు సహస్రనామంతో పాటు పలు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నారాయణస్వామి

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి

తాళ్లపూడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) భగవద్గీతను చదివినంతనే మనిషి జీవితంలో పలు మార్పులు జరుగుతాయని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం గీతా జయంతి సందర్భంగా తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో మహిళలు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. అనంతరం భక్తులు గ్రామ సంకీర్తన చేశారు. తాళ్లపూడి గీతా మందిరంలో వేద పండితుల ఆధ్వర్యంలో రాధాకృష్ణులకు లక్ష తులసిపూజ, సామూహిక విష్ణు సహస్ర పారాయణం, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సంకీర్తన చేస్తున్న కృష్ణ భక్తులు

భక్తి శ్రద్ధలతో వెంకన్న కల్యాణం


దేవరపల్లిలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందిస్తున్న దృశ్యం

దేవరపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతిని పురస్కరించుకుని ఆలయంలో వైభవంగా కల్యాణాన్ని జరిపారు. ఈ ఉత్సవంలో రాజమహేంద్రవరానికి చెందిన పెనుమత్స నందకిషోర్, ఇందిరాదేవి దంపతులు కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆలయ అర్చకులు కేశావాచార్యులు, సత్యదత్త దుర్గాప్రసాద్, వేదపండితులు కార్తీక్, కల్యాణ తంతును జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


కాపవరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద సప్తాహం

భక్తి శ్రద్ధలతో సప్తాహం

పెరవలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాపవరంలోని వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నిర్మించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సప్తాహం నిర్వహిస్తున్నారు. ఈ నెల 6న ప్రారంభమైన కార్యక్రమం 13 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజు అన్నదానం నిర్వహిస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

చాగల్లు, డిశంబరు 11, (ఆంధ్రజ్యోతి): చాగల్లు సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 28వ వార్షిక లక్షపత్రి పూజలు ఘనంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు ఏకాదశి రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, సూర్య నమస్కారాలు, జ్యోతిర్లింగార్చన తదితర పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, లక్షపత్రి పూజా కమిటీ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిపారు.

రోలర్ హాకీలో మెడల్ సాధించడమే లక్ష్యం : కేశవ్

ఉండ్రాజవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీలో 2027లో నిర్వహించే ఏషియన్ ఛాంపియన్‌షిప్ రోలర్ హాకీలో మెడల్ సాధించడమే లక్ష్యమని చివటం గ్రామానికి చెందిన మునుపర్తి నాగసాయికేశవ్ బుధవారం తెలిపారు. డిసెంబరు 5వ తేదీ నుంచి జరిగిన అండర్-14 సబ్ జూనియర్ విభాగంలో నేషనల్ రోలర్ స్కేటింగ్ హాకీకి జాతీయస్థాయి పోటీల్లో ఏపీ టీమ్ గోల్ కీపర్‌గా రాష్ట్రస్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జరిగిన రోలర్ స్కేటింగ్ హాకీలో సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. గత ఏడాది స్టేట్ రోలర్ స్కేటింగ్ హాకీలో కాంస్య పతకం పొందానన్నారు. తణుకులో ఏడో తరగతి చదువుతున్న కేశవ్ రెండేళ్లుగా కోచ్ భార్గవ్ వద్ద శిక్షణ పొందుతున్నానన్నారు. తన కుమారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మంచి పేరు తీసుకురావాలని తల్లిదండ్రులు రమేష్, దేవి ఆకాంక్షించారు.


మెడల్స్ సాధించిన కేశవ్‌తో తల్లిదండ్రులు రమేష్, దేవి

18 నుంచి రెవెన్యూ సదస్సులు

దేవరపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 18 నుంచి 28 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సచివాలయాల వద్ద నిర్వహిస్తామన్నారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని తెలిపారు. 13న చిన్నాయిగూడెం, 16న దేవరపల్లి, 17న యాదవోలు, 18న యర్నగూడెం, 19న దుద్దుకూరు, 20న లక్ష్మీపురం, 21 పల్లంట్ల, 23ధూమంతనగూడెం, 24న గౌరీపట్నం, 26న కొండగూడెం, 27న త్యాజంపూడి, 28న కురుకూరు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ఫ్రీజర్ వ్యాన్ అందజేత

పెరవలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.రాము తన సేవలతో పలువురికి ఆదర్శంగా నిలిచారని సర్పంచ్ బావన మధు పూర్ణ చంద్ పేర్కొన్నారు. తన ట్రస్టు ద్వారా కానూరు పంచాయతీకి ఫ్రీజర్, వ్యాన్ సమకూర్చి బుధవారం సర్పంచ్‌కు అందించారు. గ్రామానికి చెం దిన పలువురు ఆయన సేవలను కొనియాడారు. కరోనా సమయం నుంచి ఉచిత అంబులెన్స్ ఆక్సిజన్ అందించారన్నారు. ఆరుగురికి గుండె ఆపరేషన్‌లు, పదిహేను మందికి కిడ్నీ ఆపరేషన్‌లు చేయించారన్నారు. ఇప్పటికి ముప్పైసార్లు బ్లడ్‌ను డొనేట్ చేశారని ఆయన ఆర్గనైజేషన్ ద్వారా 25 వేల మందికి పైగా బాధితులకు బ్లడ్ అందించినట్లు వక్తలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు అనపర్తి నరసింహమూర్తి, అనపర్తి సత్తిపండు, కోలా సీతయ్య నాయుడు, రంకిరెడ్డి ప్రసాద్, బూరుగుపల్లి రాజు, తోట సురేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటరాముడు, బీఎస్పీ నాయకులు వెన్నపు సుధాకర్ పాల్గొన్నారు.


కానూరు పంచాయతీకి ఫ్రీజర్ వ్యాన్ అందిస్తున్న దృశ్యం

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలంలో నేటి నుంచి జనవరి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణ, మండలంలోని 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం దొమ్మేరు 1, 2 సచివాలయాలు, కాపవరం సచివాలయానికి సంబంధించి దొమ్మేరు 1వ సచివాలయంలో, 13న నందమూరు, 16న కొవ్వూరు మున్సిపాల్టీ పరిధిలోని 10 సచివాలయాలకు సంబంధించి కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో, 17న చిడిపి, 18న ఆరికిరేవుల, 19న పెనకనమెట్ట, 20న పశివేదల, 21న తోగుమ్మి, 24న చిగురులంక, మద్దూరులంక గ్రామాలకు సంబంధించి సీతంపేట గ్రామ సచివాలయం వద్ద, 26న కుమారదేవం, 27న ధర్మవరం, 28న పంగిడి, 31న దేచర్ల, జనవరి 2న వేములూరు, 3న వాడపల్లి, 4న మద్దూరు గ్రామాల్లో ఆయా సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.


తాళ్లపూడి తహశీల్దార్ రవీంద్రనాథ్

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వీటిని ప్రజలు, రౌతులు సద్వినియోగం చేసుకోవాలని తాళ్లపూడి తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సదస్సుల్లో రీ సర్వేకి సంబంధించిన అంశాలు తప్ప మిగతా రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

ఇసుక లారీలు పంగిడి మీదుగా వెళ్లాలి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి చాగల్లు పరిసర ప్రాంతాలకు ఇసుక రవాణా చేసే లారీలు పంగిడి మీదుగా రాకపోకలు సాగించాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ సూచించారు. ప్రజల ఫిర్యాదులు, భయాందోళన నేపథ్యంలో ర్యాంపుల్లోని ఏజెన్సీలకు తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. అందరూ పాటించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


యర్నగూడెంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.7,67,073 చెక్కు గ్రామానికి చెందిన సత్తిరాజు సూర్యశేష జలదీశ్వరికి అందించారు. దేవరపల్లి మండలం యర్నగూడెం, చిన్నాయిగూడెం, కురుకూరు, దేవరపల్లి, గ్రామాల్లో సీఎం రిలీఫ్ చెక్కులు పలువురికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రం అభివృద్ధిపథంలో నడిపించటానికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అండ్రూ అనిల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, గద్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లకు చెందిన అల్లాడ రాజేంద్ర ప్రసాద్‌కి ఎమ్మెల్యే మద్దిపాటి 2లక్షల54వేల2ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు తాతిన సత్యనారాయణ, గుదే సుబ్బారావు, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవలపల్లిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఏపీఈడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. లోకల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రేపు చాగల్లులో...

చాగల్లులో శుక్ర, శనివారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఏపీఈడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.నారాయణ అప్పారావు చెప్పారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. చాగల్లు, మీనానగరం, నెలటూరు విద్యుత్ వినియోగదారులు దీన్ని గమనించి సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

26న పీఎంపీ వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ది రెడ్డీస్ ఫంక్షన్ హాలులో 26న పీఎంపీ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు బుధవారం తెలిపారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో హుకుంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పీఎంపీ హాజరు కావాలని పిలుపునిచ్చారు

సీఎం సహాయ నిధి

గోపాలపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ప్రాణపాయ స్థితిలో ఉన్న ప్రతీ ఒక్కరికి సంజీవనిలాంటిదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని చిట్యాల కరగపాడు గ్రామాలకు చెందిన గద్దే హరినాథ్‌కు రూ.1,20,000, కరగపాడు గ్రామానికి చెందిన బుర్రి లక్ష్మయ్యకు రూ.31,843ల సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోపాలపురం నియోజకవర్గంలో ప్రాణపాయస్థితిలో ఉన్నవారికి సుమారు కోటి 50లక్షల వరకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, కార్యదర్శి వడ్లమూడి రమేష్, సీనియర్ నాయకులు గద్దే హరిబాబు, రాము, శ్రీనివాసరావు, మద్దిపాటి రమేష్, జ్యేష్ఠ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మండలంలోని 16 గ్రామాలను 3 బ్యాచ్‌లుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌కు రెండు రోజుల శిక్షణ అందిస్తామన్నారు. గురు, శుక్రవారాల్లో చిడిపి, కుమారదేవం, ఆరికిరేవుల, పెనకనమెట్ట, ధర్మవరం గ్రామాలు, 17, 18 తేదీల్లో దొమ్మేరు, కాపవరం, పంగిడి, నందమూరు, పశివేదల గ్రామాలు, 19, 20 తేదీల్లో వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, సీతంపేట, మద్దూరులంక గ్రామాలకు సంబంధించి కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ అందిస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులకు మండలంలోని సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రేడ్ (1-5) పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు.



లారీ ఢీకొని యువకుడి మృతి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆరేపల్లి అనిల్ మంగళవారం రాత్రి కాతేరు తిరుమల పాఠశాలలో తరగతులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. పంగిడి హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి కిందపడిపోయిన అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట

• నాలుగు జిల్లాల్లో 29 బైక్‌ల చోరీ..నలుగురి అరెస్టు • ముగ్గురు బాలలే • మరొక నిందితుడు పరారీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెడువ్యాసనాలకు బానిసలైన యువకులు, బాలలు కలిసి 29 బైక్‌లు, స్కూటీలను కొట్టేశారు. దొంగిలించబడిన బైక్‌లు మాత్రం నాలుగు జిల్లాల పరిధికి చెందివని కావడం గమనార్హం. రాజమహేంద్రవరం త్రీటౌన్‌లో బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్‌బాబు వీటి వివరాలు తెలిపారు. కాతేరు గామన్ బ్రిడ్జి రోడ్డులో ఈ నెల 11న వాహనాల తనిఖీ చేస్తుండగా సుమారు 16 నుంచి 19 ఏళ్ళ మధ్య వయసు గల నలుగురు రెండు మోటార్ సైకిళ్లపై వెళుతూ పోలీసులను చూసి వెనక్కి తిరిగి పారిపోతుండగా పట్టుకున్నామని చెప్పారు. వారిని విచారించగా రాజమహేంద్రవరం వీకర్స్ కాలనీకి చెందిన కుప్పం తేజ(19)తో పాటు మరొక ముగ్గురు బాలలను గుర్తించామన్నారు. వీరితో పాటు బైక్ దొంగతనాలకు పాల్పడిన రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన శ్రీరామ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ ఐదుగురు కలిసి జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌లు, స్కూటీలు దొంగిలించారని తెలిపారు. వీరు దొంగిలించిన బైక్‌లను కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్నలకు విక్రయించారని తెలిపారు. కొన్ని బైక్‌లను రాజమహేంద్రవరం క్వారీ గోతుల్లో దాచిపెట్టారని చెప్పారు. ఈ ఐదుగురు దొంగలు కలిసి త్రీటౌన్ పరిధిలో 12 బైక్‌లు, ప్రకాష్‌నగర్, రాజానగరం, కోరుకొండ, ధవళేశ్వరం, కడియం, అవిడి, నిడదవోలు, ప్రత్తిపాడు, ఏలూరు ప్రాంతాల్లో స్కూటీలను అపహరించారని తెలిపారు. దొంగ బైక్‌లు కొనుగోలు చేసుకున్న వారిపైన సెక్షన్ 4 (11) కింద కేసులు నమోదు చేశామన్నారు. దొంగిలించబడిన బైక్‌ల విలువ సుమారు రూ.11.60 లక్షలు ఉంటుందన్నారు. నిందితుల్లో ముగ్గురు బాలలను జువైనల్ కోర్టుకు, మరొక నిందితుడిని రిమాండ్‌కు పంపించామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ వి.అప్పారావు, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

డీఏపీ కొరతతో రైతుల అగచాట్లు


వేళ్లచింతలగూడెంలోని డీసీఎంఎస్ గోదాము

గోపాలపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు డీఏపీ అందని ద్రాక్షగా మారింది. ప్రతిఏటా ఈ సీజన్‌లో పొగాకు సాగు చేసే రైతులు ఇతర ఎరువులతో పాటు డీఏపీని ఉపయోగిస్తారు. ఈ ఏడాది తుఫాన్ల ప్రభావంతో పొగాకు నాట్లు ఆలస్యంగా జరిగాయి. మండలంలో వేలచింతలగూడెం, రాజంపాలెం గ్రామాల్లో డీసీఎంఎస్ గోదాము గోపాలపురం, జగన్నాధపురం, కొవ్వూరుపాడు, హుకుంపేట, రాజంపాలెం, భీమోలు తదితర గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ డీఏపీ మాత్రం అందుబాటులో లేదు. దీంతో రైతులు అవి దొరక్కపోవడంతో ఎరువులు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో డీఏపీకి 1150 నుంచి 1650 వరకు ధర పెరిగిందని దీంతో కంపెనీలు సరఫరా చేసే డీఏపీ తెలంగాణ రాష్ట్రానికి తరలిపోతోందని పొగాకు రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డీఏపీని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో 3915 మంది రైతులకు సంబంధించి 19,401.45 ఎకరాల్లో పొగాకు సాగవుతోంది. ఈ ఏడాది ఎకరానికి 2 బస్తాల డీఏపీ చొప్పున 38,802.9 బస్తాల వరకు ఈ ఏడాది అవసరమవుతుంది. దీనిబట్టి చూస్తే మండలంలో డీఏపీ కొరత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

నీటి సంఘం ఎన్నికలకు తేదీ ఖరారు


మాట్లాడుతున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికలకు తేదీ ఖరారైందని తహశీల్దార్ అజయ్‌బాబు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో పీవో, ఏపీవో ఎన్నికల అధికారుల సహాయ సిబ్బందికి బుధవారం సమావేశం జరిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 11 చోట్ల నీటి సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. పీవోలు, ఏపీవోలు, ఎన్నికల నిర్వహణ సిబ్బంది, అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పీవోలు, ఏపీవోలు, ఎన్నికల సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఏడాదికే వివాహిత ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడాదికే వివాహిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన కొవ్వూరులో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీకి చెందిన నేతల దేవి (21) స్వస్థలం కాకినాడ జిల్లా తొండంగి మండలం చిన్నాయిపాలెం. బుధవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకుముందు భర్త వీరబాబుకు ఫోన్ చేసి చికెన్ తెమ్మని చెప్పింది. అతడు చికెన్ పట్టుకుని వచ్చి వీరబాబుకు భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. కిందకు దింపే సరికి మృతి చెందిందని, ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో గత నెలలో 20రోజులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించామని వీరబాబు తెలిపాడు. వీరికి వివాహం జరిగి ఏడాది కావస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇప్పటివరకు బాధితులనుంచి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.


మృతి చెందిన వివాహిత దేవి

పౌష్టికాహార కిట్లు అందజేత

దేవరపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య రక్షణకు పోషకాహార కిట్లు అందించడానికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావాలని రాష్ట్ర ఎస్‌డీవో స్టేట్ టీబీ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు.టీబీ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు.టీబీ నయం అయ్యేవరకు ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి జమ చేస్తుందన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

N.V.B.L.లావణి, న్యాయవాది.
Cell: 94402 15128

బహిరంగ ప్రకటన

[illegible]

N.V.B.L.లావణి, న్యాయవాది.
Cell: 94402 15128

బహిరంగ ప్రకటన

[illegible]

N.V.B.L.లావణి, న్యాయవాది.
Cell: 94402 15128

బహిరంగ ప్రకటన

[illegible]

వూ హద్దులా మధ్య గల 339 చ.గ. స్థలమునకు హద్దులు.
N.V.B.L.లావణి, న్యాయవాది.
Cell: 94402 15128

దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు, బ్రిడ్జిపేట సూర్యకాలనీ డోర్.నెం.11-4-39 కాపురస్తులు **గోవింద భాస్కరరావు** S/o **లేటు శంకర్ రావు** అనునేను ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా. ది.07-12-2024 వ తేదిన కొవ్వూరు మెయిన్ రోడ్డు నుండి మా ఇంటికి జిరాక్స్ తీయించుకుని తిరిగి వచ్చేటప్పుడు నా చేతి సంచిలో పెట్టిన ఒరిజినల్ దస్తావేజులు అనగా నేను ది.29-07-1993వ సం. (సెటిల్‌మెంట్ డీడ్) క్రియ దస్తావేజు నెం.1075/ టి.కె.ఐ మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినవి. మరల వెళ్లి అంతయూ వెతికినను దొరకలేదు. ఏవరికైన దొరికిన యెడల పై అడ్రసుకుగాని **సెల్:9492136758** గాని తెలియజేయగలరు.